ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు

మంగళవారం 24 డిసెంబరు 2024

రచ్చ రచ్చ

బెను.. కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంపై ఆంధ్రజ్యోతి చెప్పిందే అక్షరాల జరిగింది. కార్పొరేషన్‌లో కుర్చీల కోసం మేయరు సురేశ్‌బాబు, ఎమ్మెల్యే ఆర్.మాధవి మధ్య జరుగుతున్న పోరు మరోసారి రిపీట్ అయింది. డయాస్‌పైన మేయరు పక్కనే సీటు కేటాయించాలంటూ ఎమ్మెల్యే, ఆమె మద్దతు కార్పొరేటర్లు పట్టుబట్టగా.. నిబంధనల ప్రకారమే జరగాలని మేయరు వర్గీయులు భీష్మించడంతో సోమవారం జరిగిన కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఒకానొక దశలో మహిళా కార్పొరేటర్లు కొట్టుకునే స్థాయికి వచ్చారు. టీడీపీ, వైసీపీ కార్పొరేటర్ల మధ్య జరిగిన వాగ్వాదం వీధి గొడవలను తలపించే విధంగా సాగింది. సమావేశం జరుగుతున్నంత సేపూ కార్పొరేటర్లు కొందరు మేయరుకు మద్దతుగా మరికొందరు ఎమ్మెల్యేకు మద్దతుగా నినాదాలు చేస్తూనే ఉన్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందో నన్న టెన్షన్ అధికారుల్లో నెలకొంది. అయితే మేయరు వ్యూహాత్మకంగా 8మంది కార్పొరేటర్లను సస్పెండ్ చేసి సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. మధ్యాహ్నం సభలో అజెండాలోని అంశాలను ఐదే నిమిషాల్లో ఆమోదింప చేసుకున్నారు. వివరాలిలా..



కార్పొరేషన్ కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులను అడ్డుకునే క్రమంలో కిందపడ్డ పోలీసు



తన కుర్చీ కోసం మేయర్ సురేశ్ బాబును నిలదీస్తున్న ఎమ్మెల్యే ఆర్.మాధవి



వైసీపీ కార్పొరేటర్లు, ఎమ్మెల్యే మద్దతు కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం

- కడప కార్పొరేషన్‌లో కుర్చీ కోసం కొట్లాట
- మేయరు వర్సెస్ ఎమ్మెల్యే
- నినాదాలతో హోరెత్తిన సమావేశమందిరం
- మేయరు అవినీతి పరుడంటూ ఎమ్మెల్యే ఫైర్
- అజెండా పేపర్లు చించివేత
- మహిళా కార్పొరేటర్లు కొట్టుకునేంత పరిస్థితి
- వీధి గొడవలను తలపించిన వాగ్వాదం
- 8 మంది కార్పొరేటర్లపై సస్పెన్షన్ వేటు
- ఐదు నిమిషాల్లో అజెండా ఆమోదం

కడప, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం గత నెల 7న నిర్వహించారు. ఇది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్వహించిన రెండో సమావేశం. అయితే ఎనిమిదేళ్లుగా వేదికపై మేయరు కుర్చీ పక్కనే అటు ఇటూ ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు సీట్లు కేటాయించేవారు. గత నెల జరిగిన రెండో సమావేశంలో మాత్రం డయాస్‌పై నిబంధనల మేరకు కేవలం మేయరు కుర్చీ ఒక్కటే ఏర్పాటు చేశారు. దీనిపై ఆరోజు సమావేశంలో ఎమ్మెల్యే ఆర్.మాధవి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అప్పట్లో కూడా సభ గందరగోళంగా మారింది. చివరకు మేయరు సభను బాయ్‌కాట్ చేసి వెళ్లారు. ఈ నేపథ్యంలో తిరిగి సోమవారం ఉదయం 11గంటలకు మేయరు సురేశ్‌బాబు అధ్యక్షతన కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం మొదలైంది.

నా కుర్చీ కథ తేల్చండి

మేయరు అజెండా ప్రకారం సభను నడిపేందుకు ప్రయత్నించగా ఎమ్మెల్యే అడ్డుకున్నారు. ఆమె డయాస్ పైకి చేరుకుని మేయరు పక్కన నిల్చుని ముందు తన కుర్చీ కథ తేల్చిన తరువాత సమావేశం మొదలుపెట్టాలని పట్టుబట్టారు. ఇటీవలే వైసీపీ నుంచి టీడీపీలో చేరిన 8 మంది కార్పొరేటర్లు ఎమ్మెల్యేకు మద్దతుగా డయాస్ పైకి వచ్చారు. కొందరు వైసీపీ కార్పొరేటర్లు డయాస్‌పైకి వచ్చి మేయరుకు మద్దతుగా నినాదాలు చేశారు. మేయరుకు కుడి వైపున వైసీపీ కార్పొరేటర్లు నిలబడగా.. మరోవైపు ఎమ్మెల్యే పక్కన టీడీపీ కార్పొరేటర్లు నిలబడ్డారు. ఎమ్మెల్యేకు మద్దతుగా కార్పొరేటర్లు 'అప్పుడు అలా..ఇప్పుడు ఇలా', 'మహిళలంటే చిన్న చూపా' అనే ప్లకార్డులను ప్రదర్శించారు. ఒక ప్లకార్డులో అప్పటి డిప్యూటీ సీఎం అంజద్ బాషా, అప్పటి కమలాపురం ఎమ్మెల్యే రవీంద్ర నాథరెడ్డి మేయరు పక్కన ఉన్న ఫొటోలను ప్రదర్శించారు. మరో ప్లకార్డులో 'హలా యాజ్ జయశ్రీ.. రెండు ఫ్లోర్లు అనుమతి తీసుకుని నాలుగు ఫ్లోర్లు నిర్మిస్తారా' అంటూ మేయరు కుటుంబీకుల పేరిట నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంటును ప్రదర్శించారు.

అజెండా ప్రతుల చించివేత

మహిళలంటే మేయరుకు చిన్నచూపని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. "వైసీపీ పాలనలో మేయరు కుడి, ఎడమ వైపు కడప, కమలాపురం ఎమ్మెల్యేలకు కుర్చీలు వేశారు. ఎనిమిదేళ్లుగా కొనసాగిన సంప్రదాయాన్ని ఎందుకు మానివేశారు? నీవు (మేయరు) అవినీతిపరుడవు.. దేవునికడప రోడ్డు నీ కొడుకుకు ఇచ్చావు.. కార్పొరేషన్‌ను దోచుకున్నావు" అంటూ మేయరు సురేశ్‌బాబుపై ఎమ్మెల్యే ఊగిపోతూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అజెండాలోని అంశాలను చదవాలంటూ వైసీపీ కార్పొరేటర్లు నినాదాలు చేస్తుండగా... సంప్రదాయం కొనసాగించాలి, మహిళలంటే చిన్న చూపా, కుర్చీ వేయాలంటూ టీడీపీ కార్పొరేటర్లు నినాదాలు చేశారు. మేయరు సీసీ విశ్వనాథ రౌ డి అజెండా చదివే ప్రయత్నం చేయగా, ఎమ్మెల్యే మద్దతు కార్పొరేటర్లు వాటిని లాక్కుని చించివేశారు. మేయరు అవినీతిపరుడని సమావేశం జరిగితే అవినీతి అక్రమాలు బయటికి వస్తాయని, నీవు నీ కొడుకు రోడ్ల పనుల్లో మోసం చేశారంటూ ఎమ్మెల్యే మేయరు వద్దకు దూసుకుపోయి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు గౌరవం ఇవ్వరా అంటూ వైసీపీ కార్పొరేటర్లపై విరుచుకుపడ్డారు. గంటన్నర పాటు సమావేశమంతా నినాదాలతో దద్దరిల్లింది.

8 మంది కార్పొరేటర్ల సస్పెన్షన్

11గంటలకు మొదలైన సభ ఒకటిన్నర గంట దాటినా రచ్చరచ్చగానే ఉండటంతో మేయరు సురేశ్‌బాబు 8మంది కార్పొరేటర్లపై సస్పెన్షన్ వేటు వేశారు. ప్రజా సమస్యలు, అభివృద్ధిపై జరిగే చర్చను అడ్డుకుని సభకు తీవ్ర అంతరాయం కలిగించారంటూ ఎక్స్ అఫిషియో మెంబరు అయిన కడప ఎమ్మెల్యే ఆర్.మాధవికి మద్దతుగా ఉన్న 2, 3, 6, 8, 25, 32, 42, 50 కార్పొరేటర్లు ముక్కెర సుబ్బారెడ్డి, మానస, నాగేంద్ర, ఎ.లక్ష్మీశ్రీదేవి, కె.సూర్యనారాయణ, జఫ్రుల్లా, చల్లా స్వప్న, కట్టమీద అరుణ సస్పెండ్ చేసి సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు.

ఐదు నిమిషాల్లో అజెండా ఆమోదం

తిరిగి 3.08గంటలకు మేయరు సురేశ్‌బాబు, కార్పొరేటర్లు వచ్చారు. అప్పటికే వేదికపై ఉన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ మేయరు, కార్పొరేటర్ల కేమో చికెన్ ముక్కలు, బిరియాని.. మరి పోలీసులకు పాత్రికేయులకు పప్పన్నం పెడతారా అని ప్రశ్నించారు. సిగ్గుండాలి అంటూ వైసీపీ మహిళా కార్పొరేటర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భోజనాలు ఏర్పాటు చేసింది తాము కాదని, కమిషనర్ ఏర్పాటు చేశారని మేయరు చెప్పారు. సస్పెండ్ అయిన కార్పొరేటర్లను కమిషనర్ బయటకు పంపకపోవడంతో వారుకూడా తిరిగి లోపలకు వచ్చి ఎమ్మెల్యే పక్కన నిల్చున్నారు. మేయరు అజెండా చదివేందుకు ప్రయత్నించగా అక్కడే ఉన్న కార్పొరేటర్లు వాటిని లాక్కునే ప్రయత్నం చేశారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. అయితే ఐదు నిమిషాల్లో అజెండాలో పొందుపరిచిన 52 అంశాలకు వైసీపీ ర్పొరేటర్లంతా చేతులు పైకెత్తి ఏకగ్రీవంగా ఆమోదించారంటూ తీర్మానం చేసి 3.15గంటలకు సమావేశం ముగించేశారు. దీనికి ఎమ్మెల్యే, ఆమె మద్దతు కార్పొరేటర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చర్చ లేకుండా తీర్మానం చేయడానికి ఇంత ఖర్చు ఎందుకు అంటూ ప్రశ్నించారు. సభ్యులు అజెండాను ఏకగ్రీవంగా తీర్మానించారని చెప్పేసి మేయరు తన చాంబరులోకి కార్పొరేటర్లతో వెళ్లిపోయారు. ఇక టీడీపీ కార్పొరేటర్లు మరో గదిలో వెళ్లారు. చివరికి మేయరు వెళ్లిపోయిన తరువాత ఎమ్మెల్యే కూడా తన అనుచరులతో వెళ్లిపోయారు.

అంతా ఉత్కంఠ

కడప కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం యుద్ధ వాతావరణాన్ని తలపించింది. మోటరు సైకిళ్లు, వాహనాల ర్యాలీతో ఎమ్మెల్యే ఆర్.మాధవి కార్పొరేషన్ వద్దకు చేరుకున్నారు. మేయరుకు వైసీపీ కార్పొరేటర్లకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ టీఎన్ఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు కార్పొరేషన్‌లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో టీడీపీ శ్రేణులు, పోలీసులకు తోపులాట జరిగింది. పలువురు పోలీసులు కింద పడ్డారు. పోలీసులు కార్పొరేటర్లను మాత్రమే లోపలికి అనుమతించారు. ఇక సమావేశం ప్రారంభం అయిన తరువాత ఎమ్మెల్యేకు, మేయరుకు మద్దతుగా ఇరుపక్షాల కార్పొరేటర్లు నినాదాలు చేశారు. ఎమ్మెల్యే మాధవి తనదైన శైలితో ఆగ్రహంతో మాట్లాడుతూ.. మేయరు, వైసీపీ కార్పొరేటర్లకు చెమటలు పట్టించారు. సమావేశంలో ఎక్కడ మహిళా కార్పొరేటర్లు కొట్టుకుంటారో అన్నట్లుగా తయారైంది.



అజెండాలోని అంశాలన్నింటికి చేతులు పైకి ఎత్తి ఆమోదం తెలుపుతున్న కార్పొరేటర్లు

వర్రా బెయిల్ పిటిషన్ 27కు వాయిదా

కడప రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియా జిల్లా కో-కన్వీనర్ వర్రా రవీందర్‌రెడ్డి బెయిల్ పిటిషన్ విచారణను ఎస్సీ, ఎస్టీ కోర్టు(నాల్గవ అదనపు జిల్లా కోర్టు) 27వతేదీకి వాయిదా వేసింది. వర్రాకు బెయిల్ మంజూరు చేయాలని దాఖలైన పిటిషన్ సోమవారం విచారణకు రాగా ఏపీపీ బాలాజీ వర్రా కేసుకు సంబంధించిన సీడీ ఫైల్‌ను కోర్టుకు అందజేశారు. న్యాయస్థానం తదుపరి విచారణను 27కు వాయిదా వేసింది. అలాగే రాజంపేట మండలం మన్నూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో వర్రాను పీటీ వారెంట్ (ప్రిజనర్ ఇన్ ట్రాన్సిట్)పై కోర్టుకు హాజరపరిచిన కేసు విచారణను కూడా సదరు న్యాయస్థానం 27కు వాయిదా వేసింది.

వైసీపీ హయాంలో ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి అడ్డగోలుగా ప్రభుత్వ ఆస్తులను తమ వ్యక్తిగత రాజకీయ ప్రచారంకోసం వాడుకున్నారు. ప్రభుత్వ అనుమతి లేకున్నా కౌన్సిల్ తీర్మానం చేసి కొర్రపాడు రోడ్డులోని మున్సిపల్ స్థలంలో రాచమల్లు రాజన్న క్యాంటీన్ పెట్టారు. విలువైన ఆ స్థలానికి నామమాత్రపు లీజు చెల్లించి మున్సిపాలిటీ ఆదాయానికి గండికొట్టారు. దీనిపై ఇప్పుడు ఏసీబీ విచారణ మొదలు కావడంతో అప్పటి మున్సిపల్ అధికారుల్లో కలవరం మొదలైంది.

రాచమల్లు రాజన్న క్యాంటీన్‌పై..

ఏసీబీ విచారణ

- ప్రభుత్వ అనుమతి లేకుండా మున్సిపల్ స్థలంలో క్యాంటీన్ ఏర్పాటు
- బహిరంగవేలం వేయకనే స్థలం లీజుకు
- నామమాత్రపు అద్దెతో మున్సిపల్ ఆదాయానికి గండి

ప్రొద్దుటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన నంద్యాల వరదరాజులరెడ్డి నాడు వైసీపీ ప్రభుత్వంలో రాచమల్లు చేసిన అవినీతి అక్రమాలపై విచారణ జరిపిస్తానని ఎన్నికల సమయంలో ప్రజలకు హామీ ఇచ్చారు. అప్పట్లో మున్సిపల్ స్థలంలో ప్రభుత్వ అనుమతిలేకుండా కేవలం కౌన్సిల్ అనుమతితో రాచమల్లు రాజన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ఉచిత అన్నదాన కార్యాక్రమం ప్రారంభించారు. తల్లిదండ్రుల సాక్షిగా ఈ అన్నదాన కార్యక్రమం ఎన్నికల వరకే కాదని 12 ఏళ్ల పాటు కొనసాగిస్తానని నాడు ప్రజలకు రాచమల్లు హామీ ఇచ్చారు. కానీ ఎన్నికల కోడ్ రాగానే రాజన్న క్యాంటీన్ మూసివేశారు. ఆ తరువాత రాచమల్లు ఎమ్మెల్యేగా ఓడిపోయారు. కానీ ఆయన ఇచ్చిన మాట ప్రకారం రాచమల్లు రాజన్న క్యాంటీన్ తెరుచుకోకపోగా దానిని ఇటీవల మున్సిపల్ స్థలం నుంచి తొలగించారు. రాచమల్లు రాజన్న క్యాంటీన్ పేర విలువైన మున్సిపల్ స్థలం అక్రమ పద్ధతుల్లో లీజు పొంది తక్కువ అద్దెతో మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టడంపై విచారణ జరిపించాలని ఏసీబీ అధికారులకు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఫిర్యాదు చేశారు. దీంతో ఏసీబీ అధికారులు విచారణ ప్రారంభించారు.

ఖాళీ స్థలం లీజుకు ఇవ్వాలంటే..

మున్సిపల్ ఖాళీ స్థలం లీజుకు కేటాయించాలంటే ఆ స్థలం కావాల్సిన వారు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వ అనుమతితోనే స్థలాన్ని లీజుకు కేటాయించాలి. మున్సిపాలిటీ బహిరంగ వేలం వేసి సంవత్సరానికి లోబడి లీజుకు ఇవ్వవచ్చు. బహిరంగ వేలం పెట్టుకున్నా లీజు అద్దెను నిర్ణయించాలంటే ఆ ప్రదేశంలో భూమి రిజిస్ట్రేషన్ వాల్యూ ఎంత ఉందో అందులో 10 శాతం విలువను నిర్ణయించాలి. అలా కాకుండా కేవలం నెలకు రూ.15 వేలు అద్దె నిర్ణయించారు. అంతేకాకుండా సర్వేనెంబరు 624లోని కొంత స్థలాన్ని లీజుకు అంటూ నిర్దిష్టంగా ఎక్కడా రాతల్లో రాయకుండా 29.04 సెంట్లకు అనుమతులు ఇచ్చారు.

మున్సిపల్ ఆదాయానికి రూ.40లక్షల గండి

రాచమల్లు రాజన్న క్యాంటీన్ 2023 జూన్‌లో కొర్రపాడు రోడ్డులోని 29.04 సెంట్ల మున్సిపల్ స్థలంలో ఏర్పాటు చేశారు. ఈ ఏడాది సాధారణ ఎన్నికల సమయంలో కోడ్ రావడంతో రాచమల్లు క్యాంటీన్ మూతవేశారు. కానీ లీజు మాత్రం రద్దు చేయమని అప్పటి ఎమ్మెల్యే రాచమల్లు మున్సిపల్ అధికారులను కోరలేదు. దీంతో ఈ స్థలంలో రాచమల్లు రాజన్న క్యాంటీన్ 2024 అక్టోబరు నెల వరకు ఉంది. అంటే దాదాపు 16 నెలలపాటు లీజు కొనసాగింది. ఈ 16 నెలలకు కూడా నెలకు రూ.15వేలు మాత్రమే చెల్లించారు. మున్సిపల్ నిబంధనల ప్రకారం ఆ స్థలం లీజుకు ఇవ్వాలంటే నెలకు కనీసం 2లక్షల 61వేల 195 రూపాయలు అద్దె వసూలు చేయాల్సి ఉంటుంది. కేవలం నెలకు రూ.15 వేలు మాత్రమే అప్పటి మున్సిపల్ అధికారులు నిర్ణయించారు. దీంతో మున్సిపల్ ఆదాయానికి నెలకు రూ 2,46,195 నష్టం వాటిల్లింది. 16 నెలలకు దాదాపు రూ.40 లక్షల మేర మున్సిపల్ ఆదాయానికి గండి పడింది. అప్పట్లో వైసీపీ నేతలు చెప్పిందానికంతా తలాడించి అక్రమ పద్ధతుల్లో రాచమల్లు రాజన్న క్యాంటీన్‌కు అనుమతులు ఇచ్చిన మున్సిపల్ అధికారులకు ఇక్కట్లు తప్పవని చెబుతున్నారు.

ఏసీబీ విచారణ వాస్తవం

కొర్రపాడు రోడ్డులోని మున్సిపల్ స్థలంలో ఏర్పాటు చేసిన రాచమల్లు రాజన్న క్యాంటీన్ పై ఏసీబీ అధికారులు విచారణ చేస్తున్న మాట వాస్తవం. రాచమల్లు రాజన్న క్యాంటీన్‌కు మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు ఇచ్చారు.. లీజు ఎలా నిర్వహించారు.. అద్దె ఎంత చెల్లిస్తున్నారు తదితర వివరాలు తెలపాలని ఏసీబీ అధికారులు నివేదిక అడిగారు. .వీటిపై సమగ్ర నివేదిక తయారు చేసి త్వరలోనే ఏసీబీ అధికారులకు అందిస్తాం.

- మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్, ప్రొద్దుటూరు



మున్సిపల్ స్థలంలో ఏర్పాటు చేసిన రాచమల్లు రాజన్న క్యాంటీన్ (ఫైల్‌ఫొటో)

అర్జీదారుల సమస్యలు

వెంటనే పరిష్కరించాలి : జేసీ

కడప కలెక్టరేట్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా ఫిర్యాదుల వేదికలో అర్జీదారులు సమర్పించే అర్జీలను వెంటనే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సభా భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి జేసీ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఫిర్యాదులను సంబంధిత అధికారులు తాత్సారం చేయకుండా వెంటనే పారదర్శకంగా పరిష్కరించాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా తప్పని సరిగా పరిష్కరించాలన్నారు. కాగా.. తన భర్త చనిపోయాడని, తన స్థిరాస్తిని ఆన్‌లైన్ కాకుండా మరుదులు అడ్డుకుంటున్నారని చిన్నమాచుపల్లికి చెందిన మాద లక్ష్మీదేవి ఫిర్యాదు చేశారు. కాజీపేట మండలం భూమాయపల్లికి చెందిన రామకృష్ణారెడ్డి తన పొలంలో జలకళ ద్వారా బోరుబావిని వేశామని అందుకు సంబంధించిన పైపులు, స్టార్టరు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, జడ్పీ సీఈవో ఓబులమ్మ తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన అందించాలి

సమర్థవంతమైన సేవలను ప్రజలకు అందించడమే లక్ష్యంగా చేపట్టిన గుడ్ గవర్నెన్స్ వీక్ క్యాంపెయిన్ కార్యక్రమాలు జిల్లాలో నిర్విరామంగా కొనసాగిస్తూ ప్రజలకు నమ్మకమైన సుపరి పాలనను అందించాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. దేశవ్యాప్తంగా ఈనెల 19 నుంచి వచ్చేనెల 2 వరకు నిర్వహిస్తున్న గుడ్ గవర్నెన్స్ వీక్‌క్యాంపెయిన్ కలెక్టరేట్‌లోని సభాభవనంలో జడ్పీ సీఈవో ఓబులమ్మ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ గుడ్ గవర్నెన్స్ అంటే ప్రజలకు ప్రభుత్వం సమర్థవంతంగా పారదర్శకంగా జవాబుదారీతో సేవలు అందించే విధానం అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రశాసన్ గావోస్‌కి ఓర్-2024 కార్యక్రమం చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలని, పజల్లో అవగాహనను పెంచాలని అన్నారు. జడ్పీ సీఈవో మాట్లాడుతూ సుపరిపాలన అందించే లక్ష్యంతో చేపడుతున్న గుడ్ గవర్నెన్స్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

చట్టాలు, హక్కులపై

అవగాహన ఉండాలి : డీఆర్వో

కడప కలెక్టరేట్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉంటే అమ్మకాలలో జరుగుతున్న మోసాలను అరికట్టవచ్చని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ హాలులో వినియోగదారుల న్యాయ పాలనకు వర్చువల్ విచారణలు, డిజిటల్ సౌలభ్యం అనే అంశాలపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ప్రతి ఏడాది డిసెంబరు 24 వ తేదీ నుంచి 30 వరకు వినియోగదారుల వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. వినియోగదారులు తినోతినకో కష్టపడి సంపాదించిన సొమ్ముతో కొన్న వస్తువుల్లో నాణ్యత లోపిస్తే ఎంతో మనస్థాపానికి గురవుతారన్నారు. అలాంటి మోసాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. 1986లో రూపు దిద్దుకున్న వినియోగదారుల చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం 2019లో రక్షణ చట్టంగా మార్పు చేసిందన్నారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ, ఆహారకల్తీ నిరోధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

సాధారణ చార్జీలతో..

సంక్రాంతికి 294 ప్రత్యేక బస్సులు

కడప మారుతీనగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సెలవుల రద్దీని పురస్కరించుకుని వివిధ ప్రాంతాలలో ఉన్న జిల్లా వాసులను జిల్లాకు రప్పించేందుకు వీలుగా వచ్చే జనవరి 9వ తేదీ నుంచి 13వరకూ 294 ప్రత్యేక ఆర్టీసీ బస్సులను సాధారణ చార్జీలతో తిప్పుతామని ఆర్టీసీ ఆర్ఎం పి.గోపాల్‌రెడ్డి వెల్లడించారు. ఆ మేరకు అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కూడా కల్పించామన్నారు. ఈ ప్రత్యేక బస్సులు హైదరాబాద్ నుంచి 111, బెంగళూరు నుంచి 81, విజయవాడ నుంచి 30, చెన్నై నుంచి 12 బస్సులతోపాటుగా తిరుపతి, నెల్లూరు, కర్నూలు, అనంతపురం, ప్రాంతాల నుంచి మరో 60.. మొత్తంగా 294 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఇదిలావుండగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మరికొన్ని ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్యంగా సంక్రాంతి వేడుకల వేళ తమ బంధువులు, స్నేహితులకు ఏదేని కానుకలు పంపించేందుకు ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ సేవలను కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొండను తవ్వేశారు...

- అక్రమంగా గ్రావెల్ తరలింపు
- కొండ కింద భూమి ఆక్రమణ

6



షార్ట్ సర్క్యూట్‌తో పాలవ్యాన్ దగ్ధం



ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్‌లో కాలిపోయిన పాల వ్యాన్

మదనపల్లెఅర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదంలో పాలవ్యాన్ దగ్ధం అయిన సంఘటన మదనపల్లె మండలం, చిప్పిలిలో చోటు చేసుకుంది. సోమవారం మదనపల్లె అగ్నిమాపక అధికారి శివప్ప వివరాల మేరకు.. మదనపల్లె మండలం, అంకిశెట్టిపల్లెకు చెందిన శ్రీనివాసులు పాలవ్యాపారం నిర్వహించేవాడు. ఇందులో భాగంగా పాలు సేకరించడానికి పల్లెలకు వెళ్తుండగా ఆ వాహనం మదనపల్లె మండలం, చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సమీపంలో ఎలక్ట్రిక్ షార్టు సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. వెంటనే సమచారం అందుకున్న మదనపల్లె అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను పూర్తిగా ఆర్పేశారు. ఈ ప్రమాదంలో సుమారుగా రూ.4.5 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

చిరుత సంచారంతో
ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్

ములకలచెరువు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కనుగొండ రిజర్వు ఫారెస్టులో చిరుతపులి సంచరిస్తుండడంతో సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బురకాయలకోట సెక్షన్ ఫారెస్ట్ ఆఫీసర్ షబీన్‌తాజ్ సూచించారు. మండలంలోని కనుగొండ అటవీప్రాంతానికి సమీపంలో ఉన్న తుంగపల్లె, పెద్దపాళ్యం, అంగజాలపల్లె తదితర గ్రామాల్లో సోమవారం సాయంత్రం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కనుగొండలో మేకల గుంపుపై చిరుతపులి దాడి చేయడంపై గ్రామాల్లో అవగాహన కల్పించారు. ప్రజలు ఎవరూ అడివివైపు వెళ్లరాదని, చిరుతపులి గ్రామాల్లోకి వచ్చే అవకాశం లేదని, ప్రజలు భయపడొద్దన్నారు.

అనంతరం ప్రజలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు ప్రకాష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ మార్కెట్ యార్డులను రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న రైతు సంఘాల నాయకులు

కడప సెవెన్ రోడ్స్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్, కార్పొరేట్ మార్కెట్ యార్డులను రద్దు చేయాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కడపలో అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వామపక్ష రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎం.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రెగ్యులేటెడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్, కార్పొరేట్ మార్కెట్ యార్డుల ద్వారా వ్యవసాయ ఉత్పత్తులను చౌకగా అమ్మేందుకు కుట్ర చేస్తోందన్నారు.

నేషనల్ ప్రైమ్ ప్రైవేట్ మార్కెట్ యార్డులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా రాష్ట్రాల్లోని ప్రత్యేక పరిస్థితులు, పంటల సరళి, వాతావరణ మార్పులను పరిగణలోకి తీసుకోకుండా వ్యవస్థలన్నిటినీ ఒకే గొడుగు కిందికి తేవడం నల్లచట్టాల అమల్లో భాగమేనన్నారు.

ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులరెడ్డి, మనోహర్, సీపీఎం, సీపీఐ నగర కార్యదర్శులు రామ్మోహన్, వెంకటశివ, సీఐటీయూ నాయకులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టక్కోలి మనోహర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు చిన్నపరెడ్డి, శేఖర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు (బీకేఎంయూ) మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



క్రిస్మస్‌కు ముస్తాబైన
దక్షిణాంధ్ర లూథరన్ చర్చి

రైల్వేకోడూరులో బ్రిటీష్ కాలంలో నిర్మించిన చర్చి

- రైల్వేకోడూరు చర్చికి 144 ఏళ్లు
- చెక్కుచెదరని బ్రిటీషు కాలం నాటి చర్చి
- రేపు క్రిస్మస్ పండుగ

రైల్వేకోడూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టోల్గేట్ వద్ద ఉన్న దక్షిణాంధ్ర లూథరన్ చర్చి 143 ఏళ్లు పూర్తి చేసుకుని 144వ ఏడాదిలోకి అడుగుపెట్టింది. కోడూరు చర్చి సంఘ వ్యవస్థాపకుడిగా ఉన్న జోహన్ వర్లిన్ హయాంలో ఈ చర్చిని నిర్మించారు. 1882లో చర్చి స్థలంలో జర్మనీకి చెందిన పాల్ పీటర్సన్ సువార్త సేవ కోసం దర్శించారు. 1883లో జోహన్ వర్లిన్ కోడూరు మిషనరీలో పనిచేశారు. చర్చి పక్కనే 1885లో ఒక బంగ్లాను నిర్మించారు. ఆ సమయంలోనే పేద పిల్లలకు చదువు అందించడానికి హెచ్‌ఎంఎం హైస్కూల్‌ను స్థాపించారు. బ్రిటీష్ కాలంలో నిర్మించిన ఈ చర్చి నేటికీ చెక్కు చెదరకుండా ఉంది. ఈ చర్చిని నిర్మించిన తర్వాత రెడ్డివారిపల్లె, కొర్లకుంట, చిట్వేలి, పెద్దూరు తదితర ప్రాంతాల్లో చిన్న చిన్న చర్చిలను నిర్మించారు. 1951లో చర్చి పాస్టర్‌గా కలపాటి దేవదాసు వ్యవహరించారు. ఎస్‌పిఎల్ పాఠశాలలను కూడా నిర్మించారు. ఈ పాఠశాలకు 1962లో పురుషోత్తం కరస్పాండెంట్‌గా వ్యవహరించారు. కోడూరుకు సమీపంలోని బాలపల్లె సమీపంలో ఉన్న జ్యోతి కాలనీలో జోయల్ హెన్రీ మేయర్, కె.విజయరత్నం చర్చిని నిర్మించారు. రోగులకు దుస్తులు తదితరాలను వీరు పంపిణీ చేసే వారు. చర్చి మిషనరీ వారు కోడూరుకు 2 కిలోమీటర్ల దూరంలో 13 ఎకరాల విస్తీర్ణంలో 1904-06లో ప్రత్యేకంగా కుష్టు రోగులకు చికిత్సాలయం నిర్మించారు. రోగులకు 100 పడకల వసతి కల్పించారు. లాంగ్ మెమోరియల్ ట్రిప్ రైటింగ్ సంస్థను లిలియన్ మేయర్ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం స్థాపించారు. జోహన్ వర్లీన్, వర్బర్, విట్మన్, స్క్విట్రా, ఓల్ట్రస్, ఐజాక్, స్వాన్, డోర్మన్, హెచ్‌డబ్ల్యూ మేయర్, షూల్స్, డబ్ల్యూఎన్ వైస్, జెహెజ్ మేయర్ తదితరులు గురు మండలంలో సువార్త సేవలు నిర్వహించారు. ఇంతటి ఘనమైన చరిత్ర కలిగినది రైల్వేకోడూరు చర్చి. క్రైస్తవులు ప్రతి ఆదివారం ప్రార్థనలు నిర్వహిస్తారు. ఈనెల 25న క్రిస్మస్ పండుగ సందర్భంగా చర్చిని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. చర్చి లోపల, బయట రంగులు వేసి పనులు పూర్తిచేశారు. విద్యుత్ దీపాలంకరణ చేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా చర్చిలు విస్తరించాయి. క్రిస్మస్ రోజున పలు కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు ముమ్మరంగా చేస్తున్నారు. చర్చి పాస్టర్ల ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహిస్తారు. క్రిస్మస్ రోజున కుల, మతాలకు అతీతంగా ప్రజలు పాల్గొని ప్రార్థనలు చేయడం ఆనవాయితీగా మారింది.

మరో చర్చి నిర్మాణానికి...



చర్చి నిర్మించి 144 ఏళ్లు అయింది. బ్రిటీషు కాలం నాటి చర్చి కావడంతో కొత్తగా నిర్మించాలని సంఘ పెద్దలు నిర్ణయం తీసుకున్నారు. చర్చి ఆవరణలోనే మరో చర్చి నిర్మాణానికి భూమి పూజ చేశాము. నిర్మాణాలకు అనుమతి రాగానే పనులు ప్రారంభిస్తాము. క్రిస్మస్‌ను అంగరంగ వైభవంగా నిర్వహిస్తాం.

ఖాను, చర్చి సంఘు చైర్మన్, రైల్వేకోడూరు

క్రిస్మస్ సందర్భంగా కార్యక్రమాలు



క్రిస్మస్‌ను పురస్కరించుకుని కార్యక్రమాలు చేపట్టనున్నాము. ముందస్తుగా సెమీ క్రిస్మస్ చేస్తున్నాము. పిల్లలకు ఆటల పోటీలు, యేసు పాటలు, నృత్యాలు నిర్వహిస్తారు. ఈసారి చర్చిని సుందరంగా అలంకరిస్తున్నారు. క్రిస్మస్ రోజున ప్రార్థనలు తదితర కార్యక్రమాలు ఉంటాయి.

ఇమానియల్‌బాబు, పాస్టర్, రైల్వేకోడూరు



చర్చి ఆవరణలో నిర్మించిన కలవరికండ

కంటి అద్దాల టెండర్ ప్రక్రియ పూర్తి



జేసీ సమక్షంలో టెండర్ బాక్సును ఓపెన్ చేస్తున్న దృశ్యం

రాయచోటి కలెక్టరేట్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ అంధత్వ, దృష్టిలోప నియంత్రణ కార్యక్రమంలో భాగంగా కంటి అద్దాల టెండర్ ప్రక్రియ పూర్తయినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కొండయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బడికి వెళ్లే విద్యార్థుల్లో అంధత్వం, దృష్టిలోపం నివారణకు జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా 3, 200 కళ్లద్దాల కోసం ఈ నెల 14 టెండర్ నోటిఫికేషన్ ఇచ్చామని, టెండర్ దరఖాస్తులను సమర్పించడం కోసం ఈ నెల 16 నుంచి 22వ తేదీ వరకు గడువు ఇచ్చామన్నారు. అందిన దరఖాస్తులను సోమవారం ఉదయం 11 గంటలకు జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆధ్వర్యంలో జిల్లా ప్రొక్యూర్మెంట్ తనిఖీ చేసి తక్కువ కొటేషన్ ఇచ్చిన రాయచోటికి చెందిన ముస్తాక్‌కు 3,200 కళ్లద్దాల తయారీ పనిని అప్పగించినట్లు ఆయన తెలిపరు.

సైనిక్ స్కూల్‌లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కలికిరి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కలికిరి సైనిక్ పాఠశాలలో ఏడు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రిన్సిపాల్ నోటిఫికేషన్ జారీ చేశారు. అర్హులైన అభ్యర్థులు జనవరి 10వ తేదీలోగా కలికిరి సైనిక్ స్కూల్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు పంపుకోవాలని కోరారు. ఏడాది కంట్రాక్టు పద్ధతిన నియామకాలు జరుగుతాయని పేర్కొన్నారు. జనరల్ కేటగిరీలో మెడికల్ ఆఫీసర్ పోస్టుకు ఎంబీబీఎస్‌తో పాటు రెండేళ్ల అనుభవం ఉండాలి (జీతం రూ.73,491), కంప్యూటర్ సైన్స్ పీజీటీ పోస్టు ఓబీసీ-ఎన్‌సీఎల్‌కు రిజర్వు చేశారు (జీతం రూ.62,356), పీజీటీ మ్యాథమ్యాటిక్స్ పోస్టుకు రిజర్వేషన్ లేదు (జీతం రూ.62,356), టీజీటీ సోషియల్ సైన్స్ పోస్టును ఎస్సీలకు కేటాయించారు (జీతం రూ.58,819), పీటీఐ/మాట్రన్ పోస్టును జనరల్ మహిళలకు కేటాయించారు (జీతం రూ.58,819), కౌన్సిలర్ పోస్టును ఓబీసీ ఎన్‌సీఎల్‌కు రిజర్వు చేశారు (జీతం రూ.58,819), జనరల్ కేటగిరీలో గుర్రపు స్వారీ శిక్షకుడు పోస్టు (జీతం 38,252)కు నోటిఫికేషన్‌కు సంబంధించిన వివరాల కోసం కలికిరి సైనిక్ స్కూల్ వెబ్‌సైట్‌లో చూడొచ్చు.

కళాకారుడి దారుణహత్య

- నాటకంలో పాత్రల విషయమై ఘర్షణ
- రాయితో కొట్టి హత్య
- గుట్టలో మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐలు

గాలివీడు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నాటకంలో పాత్రల విషయంలో ఏర్పడిన వివాదం ఒకరి హత్యకు కారణమైంది. పోలీసుల కథనం మేరకు... ఒక వ్యక్తి పెద్దకర్మ సందర్భంగా నాటకం ప్రదర్శించేందుకు పది మంది కళాకారుల బృందం ఆదివారం రాత్రి మండలంలోని బోరెడ్డిగారిపల్లెకు చేరుకుంది. నూలివీడు పంచాయతీ కొత్తబండివాండ్లపల్లెకు చెందిన మల్లెల సత్యన్న (వెంకట్రమణ), నక్కల వాండ్లపల్లెకు చెందిన సొప్పరం రమణారెడ్డితో పాటు వివిధ గ్రామాలకు చెందిన కళాకారులు ఈ బృందంలో ఉన్నారు. రాత్రి 10 గంటల సమయంలో మల్లెల సత్యన్న(వెంకట్రమణ), రమణారెడ్డి నాటకంలో పాత్రల పోషణ విషయంలో ఘర్షణ పడ్డారు. వెంటనే నిర్వాహకులు కలుగజేసుకుని ఇరువురిని సర్దుబాటు చేశారు. సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు కథ పూర్తి కావడంతో కళాకారులందరూ ఎవరి వాహనాల్లో వారు వెళ్లిపోగా, సత్యన్న (వెంకట్రమణ) బోరెడ్డిగారిపల్లె సమీపంలోని బస్టాప్ వద్దకు చేరుకున్నాడు. ఇంతలో రమణారెడ్డి అక్కడికి వెళ్లి మరోసారి ఘర్షణ పడడంతో పాటు, అక్కడే ఉన్న బండ రాయితో దాడి చేసి సత్య న్నను హత్య చేశాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని రెండు కిలో మీటర్ల దూరం తీసుకువెళ్లి పూలుకుంట పంచాయతీ పెద్దారగుట్టలోని బండరాళ్ల మధ్య పడవేసి వెళ్లారని వివరించారు. బోరెడ్డిగారిపల్లె బస్టాప్ వద్ద రోడ్డుపై రక్తపు మరకలు గుర్తించిన ప్రయాణికులు సమాచారం ఇవ్వడంతో తాము సంఘటనాస్థలాన్ని పరిశీలించామన్నారు. అనంతరం చేసిన విచారణలో హత్య విషయం వెల్లడి కావడంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ హత్య వెనుక ఇంకా ఎంతమంది ఉన్నారన్న విషయం తెలియాల్సి ఉందన్నారు. మృతుడి అన్న అంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు సీఐ కొండారెడ్డి, ఎస్ఐ రామకృష్ణ వివరించారు.

కొండను తవ్వేశారు...

- అక్రమంగా గ్రావెల్ తరలింపు
- కొండ కింద భూమి ఆక్రమణ



కొండను తవ్వి చదును చేసిన దృశ్యం

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకుల ఆగడాలకు హద్దే లేకుండా పోయింది. గుట్టను తవ్వేసి గ్రావెల్ (గుట్ట ఎర్రమట్టి)ను ఇష్టానుసారంగా తరలించారు. మండలంలోని సర్వే నెంబరు-1128లో దొరిచెరువు కొండ ఉంది. అక్కడ అసైన్‌మెంట్ కమిటీ ద్వారా కొంతమంది నిరుపేదలకు భూములు ఇచ్చారు. కొండకు మరోపక్క వాహనాలు వెళ్లడానికి కూడా వీలు పడేది కాదు. అలాంటి ప్రాంతానికి వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు దారి ఏర్పాటు చేసుకుని ఎక్స్‌కవేటర్ల ద్వారా కొండను తవ్వేసి వేల ట్రాక్టర్ల మట్టిని తరలించారు. రాయచోటి, రామాపురం మండలాలకు కూడా ఇక్కడి నుంచి ట్రాక్టర్ల ద్వారా ఎర్రమట్టిని తరలించారు. తవ్వేయడంతో కొండంతా సదరమైపోయింది అప్పటి రెవెన్యూ అధికారులు కొండ ప్రాంతానికి వెళ్లి చూసిన పాపానపోలేదని విమర్శలు వెల్లువెత్తాయి. అన్నమయ్య జిల్లా ఏర్పడిన వెంటనే స్థలాలకు రెక్కలు వచ్చాయి. రాయచోటి, రామాపురం ప్రాంతాల్లో ప్లాట్ల వ్యాపారం అప్పట్లో జోరుగా సాగింది. దీంతో ఇక్కడి కొండలోని ఎర్రమట్టిని లేఅవుట్‌లకు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నారు. ఇదే కాకుండా మండలంలోని దప్పేపల్లె, పాశెం గొల్లపల్లె, కోనంపేట గ్రామాల్లో కొండలు, గుట్టలను తవ్వి మట్టి తరలించడంతో తమ పొలాలకు సమీపంలో ఉన్న కొండలు, గుట్టలను ఆక్రమించుకున్నారు. 1128 సర్వే నెంబరులో కూడా కొండను తవ్వేసి భూమిని చదును చేసుకుని అక్రమంగా పట్టాలు పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇవన్నీ అప్పట్లో రెవెన్యూ అధికారులకు తెలిసినా పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ కొండ వేంపల్లె-రాయచోటి ప్రధాన రహదారికి ఆనుకుని ఉండడంతో ఇష్టానుసారంగా ఎర్రమట్టిని తరలించారు. లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాలకు నీరు వచ్చే వెలిగల్లు ప్రాజెక్టు కుడి కాలువను కూడా మట్టితో కప్పేసి ఆ దారిలో ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా మట్టిని తరలించారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు మేల్కొని కొండలోని మట్టిని తరలించకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



దొరిచెరువు కొండ

ఎర్రమట్టి తరలించకుండా నిఘా పెడతాం
- శ్రీనివాసులు, తహసీల్దార్

మండలంలో భూఅక్రమాలు, ఇసుక మట్టి తరలించకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. నేను ఇక్కడికి తహసీల్దార్‌గా వచ్చినప్పటి నుంచి మట్టి తరలింపు జరగలేదు. గతంలో జరిగి ఉండవచ్చు. ఇప్పటి నుంచి కొండపై ప్రత్యేక నిఘా పెట్టి కొండను తవ్వకుండా, మట్టిని తరలించకుండా రాత్రివేళల్లో సిబ్బందిని కాపలా పెడతాము. మండలంలో ఎక్కడా అక్రమాలు జరగకుండా చర్యలు చేపడతాం.

సురక్షిత ప్రయాణమే ఆర్టీసీ లక్ష్యం

నూతన బస్సుల ప్రారంభోత్సవంలో మంత్రి మండిపల్లి



నూతన బస్సును ప్రారంభిస్తున్న మంత్రి

రాయచోటిటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చడమే ఆర్టీసీ ముఖ్య ఉద్దేశ్యమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన రాయచోటి పట్టణంలోని శివాలయం సర్కిల్‌లో 8 నూతన ఆర్టీసీ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే ఆర్టీసీ ముఖ్య ఉద్దేశ్యమని, రాబోయే రోజుల్లో ప్రయాణికుల సౌకర్యార్థం మరిన్ని నూతన బస్సులు ప్రారంభిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ఏపీఎస్‌ఆర్టీసీని బలోపేతం చేసి ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను తప్పక నెరవేరుస్తామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీఎస్‌ఆర్టీసీ పూర్తిగా నిర్వీర్యం అయిందని, రాబోయే కాలంలో ఏపీఎస్‌ఆర్టీసీని పూర్తిగా ప్రక్షాళన చేసి ప్రయాణికులకు నాణ్యమైన సేవలందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రాబోయే రోజుల్లో ఎక్కడ చూసినా ఎలక్ట్రిసిటీతో నడిచే బస్సులను రోడ్లపైకి తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ నేత మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ రీజనల్ మేనేజర్ రాము, నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో సెక్రటరీ ఎస్వై బాషా, జతిన్ ట్రావెల్స్ యజమాని బాబురెడ్డి, టీడీపీ నేతలు, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం : ఎస్పీ



పోలీసు సిబ్బంది సమస్యలను వింటున్న ఎస్పీ

రాయచోటిటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు గ్రీవెన్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లు, ఆయా విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది, వ్యక్తిగత, చిల్డ్రన్స్ మెడికల్ సమస్యల గురించి ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. అలాగే కడప జిల్లాకు చెందిన కొంతమంది పోలీసు సిబ్బంది కూడా ఎస్పీని కలిసి సమస్యలు చెప్పుకున్నారు. పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను విన్న ఎస్పీ వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చారు. అలాగే సిబ్బంది ఫిర్యాదులను పరిష్కరించాలని సంబంధిత జిల్లా పోలీసు కార్యాలయ అధికారులను ఆదేశించారు.

కలెక్టర్ 'పల్లెనిద్ర'తో మారిన తెల్లపాడు పరిస్థితులు

● మెరుగైన పారిశుధ్యం.. మౌలిక వసతుల కల్పన
● గ్రామానికి ఆర్టీసీ బస్సుల రాకపోకలు

కలసపాడు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలు విని అక్కడికక్కడే పరిష్కారం మార్గం చూపించాలన్న లక్ష్యంతో పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా గత నెల నవంబరు 22న కలసపాడు మండలంలోని తెల్లపాడు పంచా యతీలో కలెక్టరు శ్రీధర్ చెరుకూరి పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా సమావేశాలు నిర్వహించి అక్కడి ప్రజలతో మమేకమై మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కార మార్గం చూపారు. ఆ వెంటనే స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధితశాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో పంచా యతీలో చాలా వరకు సమస్యలు పరిష్కారం కావడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హరిజనవాడలో విద్యుత్ తీగలు తొలగింపు

పల్లెనిద్రలో భాగంగా కలెక్టరు హరిజనవాడలో ప్రజలు ఎదు ర్కొం టున్న ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఎస్సీలకు ఇళ్ల మంజూరు కాగా తక్కువ మంది మాత్రమే ఇళ్ల నిర్మాణాన్ని చేప ట్టారు. దీనికి ప్రధాన కారణం ఇళ్ల మధ్య నుంచి విద్యుత్ తీగలు వెళుతుం డడంతో చాలా మంది లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకోలేదు. ఇందుకు స్పందించిన కలెక్టరు విద్యుత్ తీగలు తొలగించివేరే మార్గంలో వేయా లని ఆదేశించారు. ఈ మేరకు ఎస్పీడీసీఎల్ అధి కారులు విద్యుత్ తీగలు తొలగించడంతో హరిజనవాడలో స్థలాలు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల కట్టుకోవడానికి మార్గం సుగమమైంది.


తెల్లపాడుకు వచ్చిన ఆర్టీసీ బస్సు(ఫైల్)


ఎస్సీ కాలనీలో విద్యుత్ తీగలు తొలగించిన దృశ్యం


మురుగునీటి కాల్వలను శుభ్రం చేస్తున్న పారిశుధ్యం సిబ్బంది

మౌలిక వసతుల కల్పన

తెల్లపాడు పంచాయతీలో తాగునీటి సమస్య, సీసీ రోడ్లు, మురు గుకాల్వలు, లిఫ్ట్ ఇరిగేషన్ సమస్యలపై గ్రామ సభలు నిర్వహించిన కలెక్టరు మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే ఉపాధి హామీ పథకం కింద గ్రామానికి మంజూరైన పనులను వేగవంతంగా మొదలుపెట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

మెరుగైన పారిశుధ్యం

తెల్లపాడు గ్రామంలో ఎక్కడ చూసినా అపరిశుభ్రత తాండవించేది. చిన్నపాటి వర్షం కురిసినా గ్రామంలో వర్షపు నీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడేవారు. దీనిపై స్పందించిన కలెక్టరు పారి శుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గ్రామంలో మురుగునీటి కాల్వలను శుభ్రం చేయడంతో పారిశుధ్య పరిస్థితులు మెరుగయ్యాయి.

ఆర్టీసీ బస్సుల రాకపోకలు

తెల్లపాడు పంచాయతీలో గత 20 సంవత్సరాల నుంచి ఆర్టీసీ బస్సు రాలేదని పల్లెనిద్రలో భాగంగా కలెక్టరు శ్రీధర్ చెరుకూరికి తెలుపగా వెంటనే స్పందించారు. రోజూ ఆర్టీసీ బస్సును నడిపేలా ఆర్టీసీ ఆర్ఎంకు ఆదేశాలు జారీ చేయడంతో ప్రతిరోజూ ఆర్టీసీ బస్సు రాకపోకలు సాగుతున్నాయి. దీంతో విద్యార్థులు మహిళలు, ప్రజలు మండలానికి వెళ్లి పనిచేసుకునే వారు తమ హర్షం వ్యక్తం చేశారు.

ఎస్టీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శ్రీనివాసులు, చంద్రశేఖర్


శ్రీనివాసులు, చంద్రశేఖర్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీ ఎఫ్) జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా శ్రీనివాసులు, బి.చంద్ర శేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఎస్టీఎఫ్ జిల్లా కార్యాలయం లో నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో కడప జిల్లా ఎస్టీఎఫ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కొవ్వూరు నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజగోపాల్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా వి.చిన్నరాముడు నాయక్, బి.రవీంద్రారెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలుగా డి.సుమలత, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆలమూరు ప్రసాద్, మహేశ్వరరెడ్డి, కోశాధికారిగా శ్రీని వాసులు ఎన్నికయ్యారు. వీరితో పాటు మరికొంతమందిని కార్యవర్గంలోకి తీసుకున్నారు. ఈ ఎన్నికలకు ఎస్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరా యుడుయాదవ్ ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, రాష్ట్ర గౌరవ సలహా దారుడు చీమల శ్రీనివాసులు పరిశీలకులుగా వ్యవహరించారు.

ఘనంగా మానసిక వ్యాధుల ఆసుపత్రి వార్షికోత్సవం


ఆసుపత్రిలో కేక్ కట్ చేస్తున్న సూపరింటెండెంట్ వెంకటరాముడు, వైద్యులు

కడప సెవెన్ రోడ్స్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప నగర పరిధిలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) ప్రాంగణంలో గల ప్రభుత్వ మానసిక వ్యాధుల ఆసుపత్రి మొదటి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆసు పత్రి ప్రారంభమై సంవత్సరం విజయవంతంగా గడిచినందున అనేక మంది రోగులకు చికిత్సలు అందించి బాగుచేయడం జరిగిందని మానసిక వ్యాధుల ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరాముడు తెలిపారు. జిల్లాలోనే కాక రాయలసీమలోనే గొప్ప వైద్య సేవలు అందిస్తున్న ఆసుపత్రిగా పేరు రావడం సంతోషకరమన్నారు. ఆసుపత్రి ప్రారంభమై నేటికి సంవత్సరం అయి న సంద ర్భంగా ఆసుపత్రి ఆవరణలో సిబ్బందితో కట్ చేశారు. కార్యక్రమంలో మానసిక వ్యాధుల ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటరాముడు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వవాహనంలో దర్శనమిచ్చిన ఈశ్వరీదేవి అమ్మవారు



బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారు సోమవారం భక్తులకు అశ్వవాహనంలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈశ్వరీదేవి ఆరాధన గురుపూజా మహోత్సవాల సందర్భంగా రెండో రోజు ఉదయం ప్రభాతసేవ, పంచామృతాభిషేకం, సహస్రనామ కుంకుమార్చన, మధ్యాహ్నం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయంత్రం వీరబ్ర హ్మేంద్రస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం అందించా రు. అంతకుముందు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మఠాధిపతి వీరకు మారస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పత్తి క్వింటాకు రూ.7521 మద్దతు ధర

కొండాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈ ఖరీఫ్ సీజన్‌లో పండించిన పత్తి పంటకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినట్లు ఏవో రామాంజులురెడ్డి తెలిపారు. పొడుగు గింజ క్వింటాకు రూ.7521, పొట్టిగింజ క్వింటాకు రూ. 7121 చొప్పున కనీస మద్దతు ధర ప్రకటించిందన్నారు. నంద్యాల బీసీజీ కాటన్ మిల్లులో కొనుగోళ్లు జరుగుతున్నాయన్నారు. మద్దతుధర కావలసిన రైతులు తమ ధ్రువపత్రాలతో రైతుసేవా కేంద్రాలలో నమోదు చేసుకోవాల న్నారు. మండలంలోని రైతులు ప్రభుత్వ నింబంధనల ప్రకారం తమ ప్రత్తిని అమ్మదలుచుకుంటే బీసీజీ కాటన్‌మిల్లు, నంద్యాల వారిని 8884229387, 9704100670 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని ఏవో తెలిపారు.

తెగిపడ్డ విద్యుత్ తీగ.. షాక్‌తో రైతు మృతి


రుద్ర శివానందరెడ్డి మృతదేహం

వేంపల్లె, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.వెలమవారిప ల్లెకు చెందిన రుద్ర శివానందరెడ్డి (40) అనే రైతు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. శివానందరెడ్డి రోజుమాదిరిగానే సోమవారం తెల్లవారుజా మున అరటితోటకు నీళ్ల పారగట్టుకునేందుకు పొలం వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో తోటలో తెగిపడ్డ కరెంటు వైరును తగలడంతో విద్యు త్‌షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. శివానందరెడ్డి మృతితో భార్య పిల్లలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వేంపల్లె ప్రభు త్వాసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు రమణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు.

అనారోగ్యంతో ఆంధ్రజ్యోతి విలేకరి మృతి


తల్లం వెంకటనాగప్రసాద్ (ఫైల్‌ఫొటో)

మైదుకూరు రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు ఆంధ్రజ్యోతి విలేకరి తల్లం వెంకట నాగప్రసాద్ (49) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఈయన ఆంధ్రజ్యోతి దిన పత్రికలో మైదుకూరు విలేకరిగా సుదీ ర్ఘకాలంగా పనిచేస్తున్నాడు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతు న్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఆయనను చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు తిరుపతి స్విమ్స్‌కు తీసుకెళ్లా రు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రసాద్ మృతి పట్ల ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ సంతాపం తెలిపారు. కాగా.. ప్రసాద్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురైన వ్యక్తి మృతి



పోరుమామిళ్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యో తి): కడపలో ఆదివారం జరిగిన బలిజ సంఘం సమావేశానికి వెళ్లి బ్రెయిన్‌స్ట్రోక్ గురై రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ప్రసాద్ (40) మృతి చెం దాడు. బంధువుల వివరాల మేరకు.. పోరుమామిళ్లలోని తంబాబావివీధికి చెందిన రాళ్లపల్లె ప్రసాద్ ఆదివారం కడపలో జరిగిన బలిజ సంఘం సమావేశానికి వెళ్లి బ్రెయిన్ స్ట్రోక్‌కు గురి కావడంతో రిమ్స్‌లో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించ గా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వారు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



పెండ్లిమర్రి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిమండలం గ్రామ సమీపం లోని నాగరాజు ప్లాట్ల వద్ద సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వగా అక్కడికి సిబ్బంది వచ్చి పరిశీ లించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

పరిశోధన ఫలాలు రైతులకు అందాలి

● ఎన్‌జిరంగ విశ్వవిద్యాలయం ఉపకులపతి


వ్యవసాయ పరిశోధన స్థానంలో వరి పంటను పరిశీలిస్తున్న ఉపకులపతి శారదజయలక్ష్మి, శాస్త్రవేత్తలు

సికెదిన్నె, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శా స్త్రవేత్తలు సృష్టించిన నూతన పరిశోధనలు, వాటి ఫలితాలు రైతులకు బాగా ఉపయో గపడాలని ఆచార్య ఎన్‌జిరంగ విశ్వవిద్యా లయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదజ యలక్ష్మి తెలిపారు. స్థానిక ఊటుకూరు వ్య వసాయ పరిశోధన స్థానాన్ని, కృషి విజ్ఞాన కేంద్రాన్ని, ఏరువాక కేంద్రాన్ని సోమవారం సందర్శించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు లకు యూటీఆర్ 181 వరి వంగడాన్ని రై తులకు అందజేయాలని.. అదే విధంగా ను వ్వుల్లో కొత్త వంగడాల రూపకల్పనలో పు రోగతిని, ఆముదపు పంటను కడప జిల్లా లో ప్రత్యామ్నాయ పంటగా సాగు చేయ డానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను, వరిలో ఉల్లికోడు తట్టుకునే కొత్త వంగడాలను త యారు చేయాలని శాస్త్రవేత్తలకు సూచిం చారు. వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థుల కు మంచి విద్యాబోధనను అందించి వారి ఉన్నత భవిష్యత్తుకు బంగారు బాటలు వే యాలన్నారు. రైతుల అభివృద్ధికి కృషి వి జ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు చేయాల్సిన కృషి ఎంతో ఉందన్నారు. వ్యవసాయ పంటలే కాకుండా ఉద్యాన, పాడి, కోళ్ల, గొర్రెలు,మే కల పెంపకంపై దృష్టి పెట్టేలా. రైతులకు మెరుగైన సేవలు అందించి వారి వ్యవసా యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఏడీఆర్ డాక్టర్ సుమతి, వ్యవసాయ పరిశోధన స్థా నం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, కేవీకే సమన్వయకర్త వీరయ్య, ఏరువాక కేంద్రం సమన్వయ కర్త అంకయ్యకుమార్, శాస్త్రవేత్తలు సునీల్‌కుమార్, శ్రీవల్లి,మాధు రి, భాగవతప్రియ,ప్రశాంతి, శిల్పకళ, మ హేష్‌బాబు, మానస, సురేష్‌కుమార్‌రెడ్డి త దితరులు పాల్గొన్నారు.

వైవీయూలో నియామకాలు


నియామకపత్రాలు అందిస్తున్న వీసీ కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ పద్మ

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవి ద్యాలయంలో పలు విభాగాలకు నూతన కోఆర్డినేటర్లను, నోడల్ ఆఫీ సర్‌ను నియమిస్తూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం సాయంత్రం వైవీయూలోని వీసీ చాంబ ర్‌లో ఆచార్య కృష్ణారెడ్డి, కులసచివులు ఆచార్య పుత్తా పద్మతో కలిసి వారికి నియామకపు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన బాధ్యతలు తీసుకున్న ఆచార్య రియాజున్నీసా, డాక్టర్ హరినాథ్, డాక్టర్ ఎస్పీ వెంకటరమణను అభినందిస్తూ ప్రభా వంతంగా పనిచేయాలని సూచించారు. కాగా, డెవలప్‌మెంట్ సెక్షన్ కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ కె.రియాజున్నీసా నియమితులయ్యారు. ఈ స్థానంలో ఇది వరకు పనిచేస్తున్న జెనెటిక్స్ అండ్ జెనోమిక్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉస్మాన్ బాషా బాధ్యతల నుంచి రిలీవ్ కానున్నారు. ఫైనాన్స్ విభాగం కోఆర్డినేటర్‌గా డాక్టర్ జి.హరనాథ్ నియమితులయ్యారు. స్వయం ప్లస్ నోడల్ ఆఫీసర్‌గా జంతుశాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్పీ వెంకటరమణను నియ మించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని అందజేశారు. భారతదేశం అంతటా విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను, ఫెలోషిప్, స్కాలర్‌షిప్, ఇంటర్న్‌షిప్ వంటి ప్రయోజనాలు పొందేలా ఈ విభాగం పనిచేస్తుం దన్నారు. కార్యక్రమంలో ప్రజాసంబంధాల విభాగ సంచాలకులు డాక్టర్ పి.సరిత పాల్గొన్నారు.

జాతీయ స్థాయి చెస్ పోటీలో తృతీయ విజేతగా కడప క్రీడాకారిణి



కడప స్పోర్ట్స్, డిసంబరు 23 (ఆంధ్రజ్యోతి): బెంగుళూరులో ఈనెల 22వ తేదీ నిర్వహించిన జాతీయస్థాయి 53వ బీఆర్ డీసీఏ చెస్ టోర్నమెంట్ అండర్-16 విభాగంలో కడప నగ రానికి చెందిన గోరంట్ల తేజోమయి ప్రతిభ కనబరచి తృతీయ విజేతగా నిలిచింది. బెంగుళూరు రూరల్ డిస్ట్రిక్ట్ చెస్ అసోసియేషన్ (బీఆర్‌డీసీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నమెంట్‌లో మొత్తం 6 రౌండ్లలో 4 పాయింట్లు సాధిం చిన తేజోమయి జాతీయస్థాయిలో మెరుగైన ప్రదర్శన గావించినట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్ దర్బారీ వెల్లడించారు. కడపలో గల విద్యామందిర్ పాఠశా లలో 9వ తరగతి చదువుతున్న తేజోమయి మునుముందు మరిన్ని పోటీలలో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

తుది దశకు...హైవే పనులు

● రూ.425 కోట్లతో ముద్దనూరు- తాడిపత్రి మధ్య నాలుగులేన్ల రహదారి
● మార్చి నాటికి పనులు పూర్తి ● పనులు పూర్తయితే తగ్గనున్న ప్రయాణ సమయం

కొండాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముద్దనూరు-తాడిపత్రి మధ్య జరుగుతున్న నేషనల్ హైవే (ఎన్‌హెచ్-67) పనులు తుదిదశ కు చేరుకున్నాయి. ఈ రహదారిపై విపరీతంగా ట్రాఫిక్ ఉండటంతో కేంద్రప్రభుత్వం రూ.425 కోట్లతో 51 కిలో మీటర్ల మేర నాలుగులేన్ల రహదారి విస్తరణ పనులను చేపట్టింది. 2022 జనవరిలో పనులు ప్రారంభం కాగా... ప్రస్తుతం తుదిదశకు చేరుకున్నాయి.


కొండాపురం మండలం ఏటూరు వద్ద చిత్రావతి నదిపై నిర్మించిన వంతెన

వేగంగా రహదారి విస్తరణ పనులు

ఈ నాలుగులేన్ల రహదారి విస్తరణ పనులను సీఎం సురేష్ నాయుడుకు చెందిన సీఆర్‌అసోసియేట్స్ సంస్థ నిర్వహిస్తోంది. అధునిక యంత్రాలతో రహదారి నిర్మాణపు పనులను వేగంగా పూర్తి చేస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని ఏటూరు వద్ద ఉన్న చిత్రావతి వంతెనపై నిర్మాణం కూడా పూర్తయింది. అదేవిధంగా జోగాపురం వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులు కూడా వేగంగా జరు గుతున్నాయి. కొండాపురం పట్టణంలో రోడ్డుకు ఇరువైపుల పాదా చారులు నడవడానికి సర్వీసురోడ్డు ను కూడా ఏర్పాటు చేశారు. అదేవిధంగా నాలుగులేన్ల రహదారి మధ్యలో విద్యుత్ దీపాలను అమర్చే ప్రక్రియ కూడా మొదలుపెట్టారు. మధ్యలో కల్వర్టులు, బ్రిడ్జి లు కూడా పూర్తవడంతో వచ్చే ఏడాది జనవరి నాటికి మొదటిదశ పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు. అదేవిధంగా మంగపట్నం వద్ద టోల్‌గేట్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

రహదారి పూర్తయితే తగ్గనున్న ప్రయాణ సమయం

ఈ రహదారిపై 51 కిలోమీటర్లు ప్రయాణించేందుకు గతంలో సుమారు గంటన్నర సమయం పట్టేది. ప్రస్తుతం రహదారి నిర్మాణం


కొండాపురం మండలం ఓబన్నపేట వద్ద పూర్తయిన నాలుగులైన్ల రహదారి

పూర్తయితే గంటలో ముద్దనూరు నుంచి తాడిపత్రికి చేరుకోవచ్చు. సుమారు అరగంట సమయం తగ్గడంతో పాటు ట్రాఫిక్ కూడా తగ్గనుంది. నాలుగులైన్ల రహదారి పనులు పూర్తికానుండటంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వచ్చే మార్చి నాటికి పనులు పూర్తి

వచ్చే ఫిబ్రవరి నాటికి దాదాపు ఈ రహదారి పనులు పూర్తవుతాయి. పనులన్నీ తుది దశకు చేరుకున్నాయి. ఈ రహదారి నిర్మాణపనులు పూర్తికావడానికి వచ్చే ఆగస్టు వరకు గడువు ఉంది. అయితే గడువుకంటే ముందే పనులు పూర్తయ్యే అవకాశం ఉంది.

-సురేంద్రారెడ్డి, ఏఈ, నేషనల్ హైవే

కుక్కలు..బాబోయ్..కుక్కలు

- వీధికుక్కలపై నియంత్రణ ఏదీ?
- వాహనదారుల వెంట పడుతున్న కుక్కలు
- ప్రతిరోజూ ఏదో ఒక చోట కుక్కకాట్లు
- గుంపులుగా సంచారం
- కుక్కల సంతతి పెరుగుతున్నా పురపాలక సంఘం చర్యలు శూన్యం
- పట్టించుకోని అధికారులు

పులివెందుల టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పురపాలక సంఘం పరిధిలోని పలు వార్డుల్లో వీధికుక్కలు స్వైర విహారం చేస్తూ రోడ్ల వెంబడి వెళ్లే వారిని గాయపరుస్తున్నాయి. కుక్కకాటుకు సకాలంలో వైద్యసేవలు పొందకపోతే ప్రాణాల మీదకు వస్తుందన్న భయంతో ఉరుకులు పరుగుల మీద వైద్యశాలలను ఆశ్రయిస్తున్నారు. వీధుల్లో కుక్కల గుంపు వల్ల పిల్లలను బయటికి పంపేందుకు వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రజలకు ప్రశాంత వాతావరణం నెలకొల్పాల్సిన పురపాలక సంఘం కూడా కుక్కల నియంత్రణ విషయంలో ఉదాశీనతగా వ్యవహరించడంతో రోజురోజుకూ వాటి సంతతి పెరుగుతోంది. కుక్కకాటుకు గురవుతున్నామని పలువురు మున్సిపల్ కార్యాలయం సిబ్బంది దృష్టికి తీసుకువచ్చినా ఫలితం లేదు. నిత్యం పులివెందుల ప్రభుత్వ వైద్యశాలకు కుక్కకాటు కేసులు వస్తూనే ఉన్నా అధికారులకు మాత్రం వాటి నియంత్రణకు చర్యలు చేపట్టాలన్న ఆలోచన కూడా లేకపోవడం శోచనీయం. వీధుల్లో కుక్కలను చూస్తే భయం భయంగా తిరగాల్సి వస్తోందని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో కూడా కుక్కలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఎక్కడ చూసినా గుంపులుగా కుక్కలు సంచారం చేస్తుండటంతో ఇళ్లల్లో నుంచి బయటికి రావడానికి ప్రజలు జంకుతున్నారు. కుక్కలు ఇప్పటికే గ్రామాల్లో పలువురిని గాయపరిచాయి. వాటి వల్ల వందల సంఖ్యలో పశువులు గాయపడ్డాయి. కుక్కల దాడిలో గొర్రెలు చనిపోయాయి. కుక్కలను కాల్చేందుకు పర్మిషన్ లేకపోవడంతో పంచాయతీ అధికారులు కూడా ఆ వైపు దృష్టిసారించడంలేదు. కుక్కల బెడద రోజురోజుకూ అధికమవుతోందని, పగ లురాత్రీ కుక్కలు వీధుల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రాత్రిళ్లు అయితే ఇళ్ల ముందే పెద్దసంఖ్యలో కుక్కలు ఉండడంతో బయటికి రావాలంటే భయపడుతున్నారు. రెండేళ్ల నుంచి కుక్కల గురించి ఎవరూ పట్టించుకోవడంలేదని ప్రజలు పేర్కొంటున్నారు. కుక్కలను చంపకూడదనే నిబంధనలు ఉన్నా వీటి సంచారం ఎక్కువ కావడానికి అధికారులు కూడా ఒక రకంగా కారణమని గ్రామస్థులు అంటున్నారు. కుక్కలు ఎక్కువ కాకుండా ప్రభుత్వం గతంలోనే కుక్కలకు శస్త్రచికిత్సలు చేయించాలని చెబుతున్నా కింది స్థాయిలో అటువంటి కార్యక్రమాలు ఏమీ జరగడం లేదు. దీంతో కుక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో రోడ్లపై ప్రజలు నడవాలంటేనే ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. ఇటీవల మారుతీహాలు బజారుకు చెందిన మహబూబ్‌బాషా పనుల నిమిత్తం స్కూటర్‌పై వెళుతుండగా కుక్కల గుంపు తనపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. యాంటి రేబీస్ వ్యాక్సిన్ జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో తీసుకున్నానని తెలిపారు. పురపాలక సంఘం పరిధిలో కుక్కల సంతతి అదుపు చేసేందుకు శస్త్రచికిత్సల కేంద్రం ఉంది. కాగా వాటిలో పనిచేసే సిబ్బందిని నియమించకపోవడంతో అది నిరుపయోగంగా మారింది. వీధుల్లో జనాభా కంటే కుక్కల సంతతి పెరగకముందే అధికార యంత్రాంగం చర్యలు చేపట్టకుంటే పట్టణంలో మరింత మంది కుక్క కాటుకు గురయ్యే ప్రమాదం ఉంది. కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు కోరుతున్నారు.

కుక్కల పెంపకానికి అనుమతి తప్పనిసరి ఇళ్లల్లో కుక్కలు పెంచుకోవాలంటే తప్పనిసరిగా మున్సిపాలిటీ, పంచాయతీ అనుమతి పొందాలి. అయితే చాలా మంది ఎలాంటి అనుమతి తీసుకోకుండానే కుక్కలను పెంచుతున్నారు. వీధి కుక్కలను అదుపు చేసే వారు లేకపోవడంతో అవి గుంపులుగా తిరుగుతూ మనుషలపై దాడులకు పాల్పడుతున్నాయి.


రోడ్డుపై గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

సమస్యను త్వరలో పరిష్కరిస్తాం



పులివెందులలో వీధి కుక్కల సమస్య ఉన్నది వాస్తవమే. త్వరలో పరిష్కరిస్తాం. గతంలో కూడా వీధికుక్కలను కొన్ని పట్టి ఇతర చోట్లకు తరలించాం. కొన్ని కుక్కలకు శస్త్రచికిత్సలు చేయించాం. వెంటనే చర్యలు చేపట్టి కుక్కల సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తాం. ప్రజలు, వాహనదారులు ఆందోళన పడవద్దు. - రాముడు, మున్సిపల్ కమిషనరు

పులివెందుల అభివృద్ధికి సహకరించండి

- మున్సిపల్ శాఖా మంత్రిని కోరిన ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి


మంత్రికి వినతిపత్రం అందించిన ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మున్సిపాలిటీ అభివృద్ధికి సహ కరించాలని రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి నారాయణను ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి కోరారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి నారాయణను కలిసి పులివెందుల సమస్యలను వివరించారు. మున్సిపాలిటీలో అనేక ప్రాంతాల్లో సరైన డ్రైనేజీ, రోడ్లు, తాగునీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2019-24 మధ్యకాలంలో ఆ నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యేనే ముఖ్యమంత్రిగా ఉన్నా సరైన అభివృద్ధికి నోచుకోలేదు. నిధులు మంజూరు చేసినా పనులు చేయడంలో యంత్రాంగం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. అనేక పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయన్నారు. కొన్ని ప్రారంభం కూడా కాలేదన్నారు. పులివెందుల మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పనులు చేయడానికి అత్యవసరంగా రూ.ఐదు కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు.

భవిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి


దివ్యాంగ విద్యార్థులకు వీల్‌చైర్లు పంపిణీ చేస్తున్న మండల విద్యాధికారులు

సింహాద్రిపురం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రంలో ఐఆర్పీల ద్వారా ఇస్తున్న ప్రత్యేక శిక్షణను దివ్యాంగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ 1 ఓబులేసు, ఎంఈఓ 2 శారద సూచించారు. సోమవారం సింహాద్రిపురంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో దివ్యాంగ పిల్లలను చేర్పడం వల్ల వారికి విద్యతో పాటు సమాజంపై అవగాహన వస్తుందన్నారు. ఇద్దరు దివ్యాంగ విద్యార్థులకు వీల్ చైర్లను మండల విద్యాధికారుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఓబులేసు, శారద, ఫిజియోథెరపీ డాక్టర్ సుధీర్, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ అరవింద్, ఐఆర్పీలు షాహిద్‌బాషా, ఇమ్షద్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఓటుతో ప్రజాస్వామ్య పరిరక్షణ

- అవగాహన సదస్సులో తహసీల్దారు నజీర్


మాట్లాడుతుఉన్న తహసీల్దార్ మహ్మద్ నజీర్

పులివెందుల టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు కీలకమని, 18 ఏళ్లు నిండిన యువతీ యువకులందరూ ఓటర్లుగా నమోదు కావాలని తహసీల్దారు మహ్మద్ నజీర్ పిలుపునిచ్చారు. సోమవారం పులివెందుల పట్టణంలోని జేఎన్‌టీయూ కళాశాల లో స్వీప్ ప్రోగ్రాంపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సంధ్బంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి 1 నాటికి ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికీ ఓటు విలువైందని, ఒక్క ఓటు తేడాతో సీఎం అభ్యర్థులు ఓడిన సందర్భాలు కూడా ఉన్నాయన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఓటు విలువ తెలుసుకోవాలన్నారు. బీఎల్‌వోల వద్ద ఫారం 6 దరఖాస్తు ఆన్‌లైన్‌లో చేసుకోవాలన్నారు. ఎన్నికల ఆర్‌ఐ క్రిష్ణమోహన్, జేఎన్‌టీయూ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హరిశ్చంద్రుని పాత్రకు ప్రాణం పోసిన శ్రీహరి

కడప కల్చరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సత్యహరిశ్చంద్ర నాటకంలో హరిశ్చంద్రుని పాత్రను వందల సార్లు నటించి ఆ పాత్రకు ప్రాణం పోసి రెండు తెలుగు రాష్ట్రాలలో మన జిల్లా కీర్తిని ఇనుమడింప చేసిన ఉత్తమ గాయకుడు శ్రీ హరిరావు అని ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి కొనియాడారు. బలిజేపపల్లి లక్ష్మీకాంత 143వ జయంతిని పురస్కరించుకుని జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో కార్యక్రమం నిర్వహించారు. రంగస్థల కళాకారులు మండల మురళి, ప్రకాశం, కిరణ్, సత్యనారాయణ, నారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కమలాపురం సీహెచ్‌సీలో సదరం క్యాంపు

కమలాపురం రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సీహెచ్‌సీలో సోమవారం సదరం క్యాంపు నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సదరం స్లాట్ బుక్ చేసుకున్న వివిధ అంగవైకల్యం కలిగిన వారు సోమవారం స్థానిక సీహెచ్‌సీలో జరిగిన సదరం శిబిరానికి హాజరయ్యారు. శిబిరానికి కడప రిమ్స్ నుంచి హాజరైన ఆర్థో వైద్య నిపుణుడు రామమోహన్ దొర అభ్యర్థుల దరఖాస్తుదారులను పరీక్షించారు. ఈ శిబిరంలో 20 మంది పాల్గొన్నారు. కాగా సీహెచ్‌సీ వైద్యాధికారి తాజుద్దీన్ మాట్లాడుతూ వివిధ సమస్యలున్న వారు సదరం స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. వారికి కేటాయించిన తేదీల్లో శిబిరానికి హాజరై సర్టిఫికెట్లు పొందవచ్చన్నారు.

కమలాపురం సీహెచ్‌సీలో ప్రతి సోమవారం సదరం శిబిరం నిర్వహిస్తామన్నారు.అయితే స్లాట్ బుక్ చేసుకున్న వారికి మాత్రమే అనుమతి ఉంటుందని ఆయన వివరించారు.

కడప సెంట్రల్ జైలులో పశువుల వేలం

కడప క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కడప కేంద్ర కారాగారం ఆరుబయట వ్యవసాయ క్షేత్రంలో ఉన్న పశువులకు ఈ నెల 27న బహిరంగ వేలం వేస్తున్నట్లు కడప ఇన్‌చార్జ్ పర్యవేక్షణ అధికారి కమల్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేలంలో ఆరు ఎద్దులు, నాలుగు ఆవులు, నాలుగు దున్నపోతులు ఉన్నాయని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు రూ.3 వేలు చెల్లించి టోకెన్ పొందాలని పేర్కొన్నారు. వేలం అనంతరం పశువులను గెలుచుకున్న వారు పూర్తి మొత్తం చెల్లించాలని, అలా చెల్లించని యెడల వారి వేలం పాట రద్దు అవుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు 9490082108, 9985914499 సంప్రదించాలని ఆయన కోరారు.

డీహెచ్‌పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శిగా చంద్రగుప్త

కడప నాగరాజుపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దళిత హక్కుల పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శిగా పి.చంద్రగుప్త ఎన్నికైనట్లు డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు తెలిపారు. చంద్రగుప్త మాట్లాడుతూ దళితుల హక్కుల కోసం పోరాడతానన్నారు.

విద్యార్థినికి సత్కారం

వీరపునాయునిపల్లె, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి):మహిళల ప్రీమియర్ లీగ్ 2025కు ఎంపికైన ఒంటిగారి రామసుబ్బన్న డిగ్రీ కళాశాల విద్యార్థిని శ్రీచరణిని సోమవారం సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.సుధీర్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థిని శ్రీచరణిని ఢిల్లీ క్యాపిటర్స్ రూ.55 లక్షలకు దక్కించుకుందన్నారు. ఉమెన్ ప్రీమియర్ లీగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

జర్నలిస్టులకు క్రీడలు అవసరం

పులివెందుల టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నిత్యం సంఘర్షణతో కూడిన వృత్తిలో ఉన్న జర్నలిస్టులకు క్రీడలు అవసర మని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో నిర్వహించిన జిల్లా మహాసభకు హాజరయ్యారు.

దేవాన్ష్‌కు శుభాకాంక్షలు

పెండ్లిమర్రి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి మనవడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్ కుమారుడు నారా దేవాన్ష్ ప్రపంచ చదరంగం పోటీల్లో విజయం సాధించిన సందర్భంగా టీడీపీ నేత గంగిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.

కార్పొరేషన్‌లో మేయర్‌కే సర్వాధికారాలు

- ఎమ్మెల్యే ఎక్స్‌అఫిషియో మెంబర్ మాత్రమే
- మెజార్టీ సభ్యుల తీర్మానం ఆమోదయోగ్యం


మాట్లాడుతున్న మేయర్ సురేష్‌బాబు

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్‌లో మేయర్‌కే సర్వాధికారాలు ఉంటాయని మేయర్ సురేష్ బాబు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కేవలం ఎక్స్‌అఫిషియో మెంబర్ మాత్రమేనని చెప్పారు. మెజార్టీ సభ్యుల తీర్మానం ఆమోదయోగ్యమన్నారు.సోమవారం కడప కార్పొరేషన్ మేయర్ చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సర్వసభ్య సమావేశాన్ని ఎమ్మెల్యే మాధవీరెడ్డి రసాబాసగా మార్చేశారన్నారు. ప్రజా సమస్యలపై చర్చించాలన్న ఇంగితజ్ఞాన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ శాసనసభ్యులైన మాధవి, చైతన్యరెడ్డిలను ఎంతో గౌరవించామన్నారు. తాము మర్యాద ఇస్తే దాన్ని అగౌరపరిచే విధంగా ఎమ్మెల్యే మాధవి వ్యవహరించారన్నారు. సాటి టీడీపీ కార్పొరేటర్‌ను సైతం కించపరిచే విధంగా మాట్లాడారన్నారు. తన ఇంటిపై చెత్తవేసి ప్రథమ పౌరుడైన తనను అవమానించారన్నారు. సొంత నిధులతో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించారన్నారు. ఈ ఏడు నెలల కాలంలో కార్పొరేషన్‌కు ఒక కోటి నిధులు ఏమైనా తెచ్చారా అని ప్రశ్నించారు. కనీసం స్కూల్ యూనిఫాం కూడా కుట్టించే గతి లేదన్నారు. తమ పార్టీ కార్పొరేటర్లను ప్రలోభాలు, భయభ్రాంతులకు గురిచేసి టీడీపీలోకి లాక్కున్నారన్నారు. సొంత నిధులతో ఆరు నెలల్లో రవీంద్రనగర్ బ్రిడ్జి పూర్తి చేస్తామని చెప్పిన ఎమ్మెల్యే ఇంత వరకు అతీగతీ లేదన్నారు. అజెండాపై చర్చ జరగకుండా అజెండానే చించి వేశారని ఆరోపించారు. వాళ్ల పార్టీ నగర అధ్యక్షుడిపైనే దాడి చేయించిన సంస్కృతి ఎమ్మెల్యే మాధవిదన్నారు. టీడీపీ కీలక నేతలే ఎమ్మెల్యే మాధవి దగ్గరికి వెళ్లడం లేదంటే ఆమె తీరు ఏపాటిదో అర్థం చేసుకోవచ్చన్నారు. జనరల్ బాడీలో మెజార్టీ సభ్యుల తీర్మానం చేశారన్నారు. సభ్యుల తీర్మానాన్ని ప్రభుత్వానికి నివేదిస్తాం అంగీకరిస్తే ఫర్వాలేదు లేదంటే న్యాయపోరాటం చేసి సాధించుకుంటామన్నారు. కుర్చీ ప్రోటోకాల్ అంశం కానే కాదని స్పష్టం చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంతో ఆశించామన్నారు. అయితే ఎమ్మెల్యే తన పంతం నెగ్గించుకోవడానికి సమావేశాన్ని రసాబాస చేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో అవినీతి సామ్రాజ్యం

మేయర్ కుర్చీకి అతను అనర్హుడు ● తప్పును ఒప్పుకొని క్షమాపణ చెప్పాల్సిందే ● కడప ఎమ్మెల్యే, విప్ మాధవి


మాట్లాడుతున్న కడప ఎమ్మెల్యే మాధవి

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్‌లో అవినీతి సామ్రాజ్యం రాజ్యమేలుతోందని కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. మేయర్ కుర్చీకి అతను అనర్హుడన్నారు. తన తప్పును ఒప్పుకొని క్షమాపణ చెప్పాల్సిందేనన్నారు. గతంలో మాదిరిగా సమావేశాలు కొనసాగించాలని పేర్కొన్నారు. సోమవారం కడప నగరం ద్వారకానగర్ ఎమ్మెల్యే నివాసంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ మెజార్టీ ఉన్న వైసీపీ పాలకవర్గం ఇటువంటి చర్చలు లేకుండా అజెండాను ఆమోదించడం దుర్మార్గమన్నారు. దీనికి ఇంత ఖర్చు, సిబ్బంది, మంది మార్బలం అవసరమా అని ప్రశ్నించారు. తన ఇంటిలోనే ఆమోదిస్తే సరిపోతుందన్నారు. మేయర్‌కు ప్రజల కోసం పనిచేయాలనే ఆలోచనే లేదని చెప్పారు. ఒక నియంతలా వ్యవహరిస్తున్నారన్నారు. కుడివైపు ఒక ఎమ్మెల్యే, ఎడమవైపు మరొక ఎమ్మెల్యేను కూర్చోబెట్టుకుని గత ఎనిమిది సంవత్సరాలుగా సమావేశాలు నిర్వహించారన్నారు. కడప నియోజకవర్గంలో ఒక మహిళ గెలిస్తే అది ఓర్చుకోలేక ఆ మహిళను ఎలా ఇబ్బంది పెట్టాలన్న ఆలోచన మాత్రమే ఉందన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు కార్పొరేషన్‌కు సంబంధించిన పనులు కల్పించి ఆదాయ వనరులు ఏర్పాటు చేసిన అవినీతి సామ్రాజ్యం ఏలుతున్నారన్నారు. మహిళలను అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేయాలనుకుంటున్నారన్నారు. కొత్తగా వచ్చిన రాజకీయ నాయకులకు మీరు ఇచ్చే సూచనలు ఇవా అని ప్రశ్నించారు. దేవుని కడప రోడ్డు, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ రోడ్డు వేసింది మీ కుటుంబ సభ్యులు కాదా అన్నారు. నాణ్యత లేకుండా పనులు చేయించారన్నారు. మాసాపేటలో మందిరం పగలగొట్టారు, అన్నమయ్య విగ్రహం తీసేశారన్నారు. మసీదులు, చర్చిలు అన్యాక్రాంతమయ్యాయన్నారు. వాటిపై చర్చిస్తామనే భయంతోనే అడ్డుకుంటున్నారన్నారు. కడప నగరంలో తాగునీటి సమస్య లేదనడం విడ్డూరంగా ఉందన్నారు. అజెండాతో కలిపి 4 అంశాలు చర్చకు జరగాల్సి ఉండగా ఎటువంటి చర్చ లేకుండా ఆమోదిస్తూ చేతులు దులుపుకొని పోవడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. జి ప్లస్ టుకి అనుమతి తీసుకొని నాలుగు అంతస్తులు కట్టుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

'రాజ్యాంగ నిర్మాతను తక్కువగా మాట్లాడడం దురదృష్టకరం'

వేంపల్లె, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్‌ను తక్కువ చేస్తూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రాజ్యసభలో మాట్లాడటం దురదృష్టకరమని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.

అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలి

కడప కలెక్టరేట్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని, అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎన్.డి విజయజ్యోతి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. నివాళులర్పించారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ

కడప మారుతీనగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌పై వాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమీత్‌షాను తక్షణమే మంత్రి వర్గం నుంచి తప్పించాలని సమితి రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

నగరంలో క్రిస్మస్ వెలుగులు


క్రిస్మస్‌కు సర్వాంగసుందరంగా ముస్తాబైన చర్చ్

కడప కల్చరల్, డిసెంబరు 23, (ఆంధ్రజ్యోతి): క్రైస్తవులకు అత్యంత ప్రధానమైన పండుగ క్రిస్మస్ రాక సందర్భంగా కడప నగరం కళకళలాడింది. క్రిస్మస్ అనగానే రంగు రంగుల కేకులు, రకరకాల బొమ్మలతో పండుగ చేసుకుందామా... పలు రకాల కానుకలు, స్టార్స్ నిచ్చే శాంతాక్లాజ్ తాతయ్య, వరాలిచ్చే క్రిస్మస్ చెట్టు, వివిధ రకాల వస్తువులతో జిల్లాలోని దుకాణాలు కళకళలాడాయి. ఆ కోవలో కడప నగర దుకాణాలు కొనుగోలు దారులతో క్రిక్కిరిశాయి. క్రిస్మస్ అనేది ప్రపంచ మానవాళికి ప్రశాంతత నిచ్చే దయామయుడి జన్మదినం. కనుక ఆ కరుణామయుడి జన్మదినాన్ని ప్రతీ ఇంటిలోనూ పలు రకాల బొమ్మలతో అలంకరిస్తారు.

లోక రక్షకుడు యేసు ప్రభువు

- ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో టీడీపీ సీనియర్ నేత లక్ష్మిరెడ్డి


క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న టీడీపీ సీనియర్ నేత లక్ష్మిరెడ్డి

కడప కల్చరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): లోక రక్షకుడు యేసు ప్రభువని, ఆయన జన్మదినాన్ని క్రిస్మస్ పర్వదినంగా ఈనెల 25న జరుపుకోవడం ఆనందకరమని టీడీపీ సీనియర్ నాయకుడు ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి కొనియాడారు. రానున్న క్రిస్మస్ పర్వదినం సందర్భంగా సోమవారం మరియాపురం చర్చిలో నిర్వహించిన ముందస్తు క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచంలోని ప్రజలంతా క్రిస్మస్ పర్వదినాన్ని సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రామరాజుపల్లె మాజీ సర్పంచ్ వెంకటేశు, జోజప్ప, భద్రయ్య, సుధాకర్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయరాజు యాదవ్‌కు ఎస్వీయూ డాక్టరేట్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం కామర్స్ విభాగ పరిశోధకుడు రాచుగాళ్ళ విజయరాజు యాదవ్ డాక్టరేట్ పొందారు. ఫర్మార్మెన్స్ ఎవల్యూషన్ ఆఫ్ సెలెక్ట్ నిఫ్టీ-50 కంపెనీస్ అంశంపై ప్రొఫెసర్ ఎం.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. కడప జిల్లా బ్రహ్మంగారి మఠానికి చెందిన విజయరాజు యాదవ్, ప్రస్తుతం హైదరాబాదులో చార్టెడ్ అకౌంటెంట్‌గా పని చేస్తున్నారు. వీరి తండ్రి రాచుగాళ్ళ పెంచలయ్య హెడ్మాస్టర్‌గా పని చేశారు. తల్లి నారాయణమ్మ. తన పరిశోధనా కాలంలో విజయరాజు యాదవ్, పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని పరిశోధనా పత్రాలు సమర్పించారు. వీరు రూపొందించిన ఆరు పరిశోధనా వ్యాసాలు ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఈ సందర్భంగా ఎస్వీయూ కామర్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ జయచంద్రారెడ్డి, అధ్యాపకులు, పరిశోధకులు అభినందనలు తెలియ చేశారు. వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి దామ్లానాయక్ తెలిపారు.

మహాసభలను జయప్రదం చేయండి

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం జిల్లా 12వ మహాసభలు జనవరి 4, 5 తేదీల్లో కడప నగరంలో జరగనున్నాయని వీటిని జయప్రదం చేయాలని కరపత్రాలు విడుదల చేశారు. సోమవారం బి.మఠంలోని స్థానిక సుందరయ్యభవన్‌లో సీపీఎంజిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు శివకుమార్, గండి సునీల్‌కుమార్, అజయ్, రాహుల్, భాస్కర్, గురయ్య, అరవింద్ మహాసభల కరపత్రాలు విడుదల చేశారు.

బకాయిలను విడుదల చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకుడు సోమవారం శివాలయం సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సంయుక్త కార్యదర్శి బి. పీటర్ మాట్లాడుతూ విద్యార్థులకు రూ.3,580 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ జాయింట్ సెక్రటరీ రాహుల్, నాని, వాసు, నాగేంద్ర, తౌసిప్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పొగాకు సాగు.. భలే బాగు

వాణిజ్య పంటలపై మొగ్గు చూపుతున్న రైతులు

అట్లూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అట్లూరు మండలంలోని రెడ్డిపల్లె గ్రామంలో నూతనంగా పొగాకు పంటను పాటూరు రాధాక్రిష్టారెడ్డి, చిలిపి క్రిష్టారెడ్డి, చిన్న రామసుబ్బారెడ్డి అనే రైతులు సాగు చేశారు. రెడ్డిపల్లె గ్రామ రైతులు ముఖ్యంగా చీనీ తోటలు సాగు చేసేవారు. ఈ ఏడాది పొగాకు సాగుకు మక్కువ చూపారు. ప్రకాశం జిల్లా గిద్దలూరు నుంచి పొగాకు మొక్కలు తీసుకుని వచ్చి యాజమాన్య పద్ధతుల ద్వారా ఎకరాకు 3వేల మొక్కలు నాటారు. ఒక్కో మొక్క రూ.3 విలువతో రూ.9వేలు ఖర్చు చేసి ఒక్కోరైతు మూడు ఎకరాలు చొప్పున 9 ఎకరాలు సాగు చేశారు. ఈ పంట ఆరు నెలలకు పూర్తిగా చేతికొస్తుంది. నాటిన మూడు నెలలకు పొగాకు కోత దశకు వస్తుంది. పసుపు పచ్చగా మారిన ఆకులను కూలీలతో కటింగ్ చేసి



కటింగ్ చేసి గుడారాల్లో ఆరబెట్టిన పొగాకు



ఏపుగా పెరిగిన పొగాకు పంట

జనపనార తాళ్లతో ఆకులను కట్టలుగా కట్టి ఆరబెట్టేందుకు గుడారాలను ఏర్పరిచి అందులో ఉంచి ఆరిన తరువాత పొగాకును చుట్టలుగా చుట్టి విక్రయించేందుకు సిద్ధం చేస్తారు. కర్నూలు జిల్లా నుంచి వచ్చిన వ్యాపారులకు విక్రయిస్తామని రైతులు తెలిపారు. ఈ పంట సాగును చూసి మండలంలోని రైతులు చాలా మంది సాగుపై మక్కువ చూపేందుకు సిద్ధపడుతున్నారు.

ఎకరాకు మూడు వేల మొక్కలు అవసరం

సాగు వివరాలు దిగుబడి ఎకరాకు మూడువేల మొక్కలు మొక్క రూ.3 చొప్పున 9వేలు మొక్కలకు ఖర్చు అవుతుంది. ఎరువులు, కోత కోసిన కూలీలకు గుడారాలకు ఎకరానికి రూ.70వేల వరకు ఖర్చు వస్తుంది. ఎకరానికి దిగుబడి 18 క్వింటాళ్ల నుంచి 20 క్వింటాళ్ల వరకు వస్తుంది. క్వింటా ధర రూ.20వేల చొప్పున వస్తుంది.

చిన్నరామసుబ్బారెడ్డి. రైతు, రెడ్డిపల్లె

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

కొండాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వాహనమిత్ర కింద రూ.15 వేలు ఇవ్వాలని, చంద్రన్న బీమా రూ.10లక్షలు వర్తింపజేయాలని, తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తెచ్చిన 21, 31 జీవోలను ఉపసహంహరించుకోవాలని కోరారు. అదేవిధంగా ఆటో యూనియన్ నూతన కమిటీని జిల్లా ఆటోడ్రైవర్ యూనియన్ అధ్యక్షుడు హరి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా వెంకటరమణ, వర్కింగ్‌ప్రెసిడెంట్‌గా సుబ్బారావు, అధ్యక్షుడిగా సురేష్, ప్రధానకార్యదర్శిగా జోసెఫ్‌ను ఎన్నుకున్నారు.

రికార్డులు తనిఖీ

మైలవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మైలవరం పోలీసు స్టేషన్‌ను జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వర్లు సోమవారం తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేసి కేసుల వివరాలు అడిగి తెలుసుకుని వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. జమ్మలమడుగు రూరల్ సీఐ గోపాల్ రెడ్డి, మైలవరం ఎస్ఐ శాంసుందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ

జమ్మలమడుగు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని ప్రభుత్వ పాఠశాల (మెయిన్) విద్యార్థులకు సోమవారం క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని కొత్త దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీవో సైదు స్నీసా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పేదలకు సేవ చేసే గుణాన్ని అలవర్చుకోవాలన్నారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు శారద క్రిస్మస్ పండుగ సందర్భంగా విద్యార్థులకు నూతన దుస్తులు పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, గోపీనాథ్, పద్మజ, చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: క్రిస్మస్ పండుగ సందర్భంగాచిత్తాశౌరిరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక కర్మేల్ మందిరం లో వివిధ గ్రామాల నుంచి వచ్చిన వంద మంది వృద్ధులకు రంగసముద్రం సర్పంచ్ చిత్తారవి ప్రకాశ్‌రెడ్డి ఉచితంగా దుస్తులు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలు, వృద్ధులు పండుగ సంతోషంగా జరుపుకోవా లన్నారు. కార్యక్రమంలో ప్రసాదరెడ్డి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ పాల్గొన్నారు.

28న మండల సర్వసభ్య సమావేశం

ఎర్రగుంట్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మండల సర్వసభ్య సమావేశం డిసెంబరు 28 ఉదయం 10.30గంటలకు ఎంపీడీవో సభాభవనంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటరమణయ్య తెలిపారు. ఈ సమావేశంలో విద్యుత్, వైద్యఆరోగ్యం, పశు వైద్యం,రెవెన్యూ అంశాలు, వెలుగు, గృహ నిర్మాణం, గ్రామపంచాయతీలు, పారిశుధ్యం, ఉపాధిహామీ,పంచాయతీరాజ్, ప్రాథమికవిద్య, రాష్ట్ర రోడ్డు రవాణా, రహదారులు-భవనాలు శాఖ తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు, మండలశాఖాధికారులంద రూ తప్పకుండా హాజరు కావాలని కోరారు.

రేపు మాజీ మంత్రి వీరారెడ్డి వర్ధంతి

బద్వేలుటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దివంగత మాజీ మంత్రి బిజివేముల వీరారెడ్డి వర్ధంతిని 25వ తేదీన నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం 9.30గంటల నుంచి నాలుగురోడ్ల కూడలిలోని వీరారెడ్డి విగ్రహానికి గజమాలలు వేసి నివాళులు అర్పిస్తామన్నారు. అనంతరం వీరారెడ్డి కళాశాలలో ఉచిత మెగా కంటి వైద్యశిబిరం, రక్తదానశిబిరం, అన్నదాన కార్యక్రమం, సంగీత, సాంస్కృతిక విభాగం వంటి పలుకార్యక్రమాలను ఏర్పాటుచేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలన్నారు.

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

జమ్మలమడుగు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని సీఎస్ఐ టౌన్ చర్చిలో సోమవారం ముందస్తుగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంగీత విభావరి విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా చర్చి ఫాస్టర్ రెవరెండ్ జనార్దన్‌బాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చర్చి కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

అన్నప్రసాదం పంపిణీ



ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో పేదలకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. సోమవారం దాతల సహకారంతో 800 మంది పేదలకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివోహం అన్నప్రసాద సేవా సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ శివోహం ఆధ్వర్యంలో మూడు సంవత్సరాలుగా శివాలయంలో పేదలకు అన్నప్రసాదం పంపిణీ చేస్తున్నామని, దాతల సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శివోహం ఉపాధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి, విష్ణునారాయణ, విజయకుమార్, లింగారెడ్డి, రమణయ్య, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రామానుజాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

కాశినాయన డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నిజజీవితంలో గణిత మేధావి శ్రీనివాస రామానుజాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని ఎంఈవో నిర్మల," ఎట్టిగుంట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం పిట్టిగుంట పాఠశాలలో రామానుజన్ జయంతిని పురస్కరించుకొని 7వ తరగతి విద్యార్థులకు పోటీపరీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా రామానుజం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈపోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలోప్రధానోపాధ్యాయుడు నారాయణ స్వామి,ఉపాధ్యాయుడు రమణారెడ్డి, నర్సాపురం,కలసపాడు హైస్కూల్స్ ప్రధానోపాధ్యాయులు కవిత, కొండిశెట్టి ఎస్టీయూ నాయకుడు సుబ్రమణ్యం,రమణారెడ్డి పాల్గొన్నారు.

శ్రీకృష్ణమందిరం అధ్యక్షుడిగా సింగరయ్య యాదవ్

బద్వేలుటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నెల్లూరురోడ్డులోని శ్రీకృష్ణమందిరం నూతన ఆలయ అధ్యక్షుడిగా సింగరయ్య యాదవ్‌ను ఆలయ అభివృద్ధికమిటీ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలి

బద్వేలు రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సోమశిల ముంపు గ్రామాల నుంచి పట్టణానికి వచ్చి నివాసం ఉంటున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని ఏపీ దళిత చైతన్య ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సొద్దల పెంచలయ్య సోమవారం ఆర్డీవో చంద్రమోహన్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత విషయంలో రాజీ ప్రసక్తే లేదు

సుబ్రహ్మణ్యం, పంచాయతీరాజ్ శాఖ ఏఈ



దువ్వూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమం చేపట్టింది. దువ్వూరు మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో సిమెంటు రోడ్ల నిర్మాణాన్ని విరివిగా చేపట్టింది. వీటితోపాటు మెటల్ రోడ్లు, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి నిధులు కేటాయించారు. పనులు కొన్ని చోట్ల వేగంగా జరుగుతున్నా మరికొన్ని చోట్ల ప్రారంభానికి నోచుకోలేదు. సిమెంటు రోడ్ల నిర్మాణంలో నాణ్యత లోపం వెంటాడుతుందనే ఆరోపణలు లేకపోలేదు. ఈ విషయాలపై దువ్వూరు మండల పంచాయతీరాజ్ శాఖ ఏఈ సుబ్రహ్మణ్యంతో ప్రత్యేక ఇంటర్వ్యూ...

ప్రశ్న: మండలంలో సిమెంటు రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు ఎంత? ఎన్ని పనులు చేపడుతున్నారు.

జవాబు: మొత్తం రూ.2.60 కోట్లు మంజూరైంది. 21 గ్రామాల పరిధిలో 43 పనులకు ఈ నిధుల కేటాయింపు జరిగింది.

ప్రశ్న: మొత్తంగా ఎంత పొడవునా రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు.

జవాబు: 5 కి.మీ. పొడవునా నిర్మిస్తున్నారు. ఇప్పటికే 3.100 కి.మీ. పొడవునా రోడ్ల పనులు పూర్తయ్యాయి.

ప్రశ్న: ఇప్పటికి ఎన్నిగ్రామాల్లో పనులు పూర్తయ్యాయి. ఇంకా చేయాల్సిన పనులు ఎన్ని.

జవాబు: 26 పనులుపూర్తయ్యాయి. మిగతా వాటిలో మెటల్ రోడ్డు, కాంపౌండ్ వాల్, మిగతావి సిమెంటు రోడ్లు పూర్తి కావాల్సి ఉంది.

ప్రశ్న: సిమెంటు రోడ్ల నిణ్యత విషయంలో లోపం ఉందని, గ్రామస్థుల ఆరోపణ. కొన్ని చోట్ల రోడ్లకు నీళ్ల పట్టడం (క్యూరింగ్) లేదంటున్నారు.

జవాబు: క్వాలిటీ కంట్రోల్ తనిఖీలు ఉంటాయి. లోపాలు కనపడితే బిల్లుల్లో రికవరీ పెట్టడం జరుగుతుంది.

ప్రశ్న: సిమెంటు రోడ్లపై వర్షపునీరు నిలువ ఉండకుండా ఇరువైపుల డ్రైనేజీల ఏర్పాటు ఏమైనా ఉందా?

జవాబు: ఆ పని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చూసుకోవాలి.

ప్రశ్న: సిమెంటు రోడ్ల విషయంలో సంబంధిత వ్యక్తులు కమీషన్లకు వాటిని పక్కవారికి కట్టబెట్టడం ఏమిటి? దీని వలన నాణ్యత లోపించదా?

జవాబు: ఇలాంటి విషయాలు మాకేమీ తెలియదు. నాణ్యత విషయంలో రాజీ పడం.

ప్రశ్న: అధికారులు మామూళ్ల మత్తులో నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారనేది నిజం కాదా.

జవాబు: ఇది నిజం కాదు. మా వృత్తి మేము నిర్వహిస్తున్నాం. నిర్మాణం విషయంలో నేను, మా సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ



చెక్కులు అందజేస్తున్న భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో సోమవారం రాత్రి టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. జమ్మలమడుగు, మైలవరం, తదితర మండలాల్లోని గ్రామాల బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కులు ఆయన పంపిణీ చేశారు. మొత్తం 17 మంది లబ్ధిదారులకు రూ.21,72,330 విలువచేసే చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాండు, చౌడం జొల్లు పాండు, నల్లగట్ల భూసిరెడ్డి, బాష, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే

రాజుపాలెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రైతు భూసమస్యలు పరిష్కరించుకునేందుకు అన్నివిధాలుగా సహకారం అందిస్తామని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అన్నారు. సోమవారం అర్కటవేముల గ్రామంలోని గ్రామ సచివాలయంలో రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దారు మనోహర్‌రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ సెంటర్లకు సామగ్రి వితరణ



అంగన్వాడీ సెంటర్లకు వస్తుసామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్టేట్‌బ్యాంకు సహకారంతో ఎంపిక చేసిన అంగన్వాడీ సెంటర్లకు లక్ష రూపాయలు విలువైన వస్తు సామగ్రి అందజేసినట్లు మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ చైర్‌పర్సన్ లక్ష్మి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని నరసింహాపురం, చౌటపల్లెల్లోని అంగన్వాడీ సెంటర్లకు ఎస్‌బీఐ, పాన్ ఇండియా, సీఎస్ఆర్, ఆక్టివిటీస్ అప్‌గ్రేడింగ్ అంగన్వాడీ సెంటర్లలో భాగంగా రాష్ట్రంలో 60 అంగన్వాడీ సెంటర్లకు సెంటర్‌కు రూ.లక్ష వంతున రూ.60 లక్షలతో వస్తు సామగ్రి అందజేసినట్లు తెలిపారు. నరసింహాపురం, చౌటపల్లె అంగన్వాడీ సెంటర్లకు టీవీ, రైస్‌కుక్కర్, ఐరన్‌ర్యాక్, వేయింగ్‌మిషన్, విద్యా కిట్, పిల్లలకు ప్లేట్లు, గ్లాసులు, చిన్నారులకు క్రీడా పరికరాలు వంటివి 30 రకాల వస్తువులను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సెంటర్ వర్కర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

'పీఎం సూర్యఘర్ యోజన'ను సద్వినియోగం చేసుకోవాలి



బద్వేలులో సూర్యఘర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జమ్మలమడుగు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గృహ వినియోగదారులు ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈ పథకం గృహ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుందని జమ్మలమడుగు విద్యుత్తు సబ్‌డివిజన్ అధికారి రాజగోపాల్ తెలిపారు. సోమవారం జమ్మలమడుగు విద్యుత్తు సబ్ డివిజన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాయితీతో మీ ఇంటిపై సోలార్ రూఫ్‌టాప్ నిర్మించుకోవాలని దీంతో విద్యుతు బిల్లులు తగ్గించుకోవచ్చని ఆయన సూచించారు. ఒక కిలోవాట్స్‌కు 120 యూనిట్లు ఉత్పత్తి అవుతుందన్నారు. వినియోగదారునికి వస్తున్న ప్రస్తుత బిల్లు కంటే తక్కువగా బిల్లులు వస్తాయని రాయితీకి ఏడాదికి విద్యుత్తు ఆదా అయ్యే బిల్లుల గురించి సూచించారు. ఆసక్తిగలవారు ఇంటిపై 1కె డబ్ల్యూపీ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఈ పథకానికి తక్కువ వడ్డీ ఇచ్చే బ్యాంకు రుణాలు లభిస్తాయన్నారు. అలాగే ప్రస్తుతం ఫోన్‌పే బిల్లులు తీసుకోవడంలేదని క్యూఆర్‌కోడ్ స్కాన్ చేసి బిల్లులు కట్టవచ్చని ఈ సౌకర్యం 2025 జనవరి నుంచి అమలులోకి రాబోతోందన్నారు. స్మార్ట్ మీటర్లు 2025 డిసెంబరు చివరి నాటికి పూర్తి చేయాలని నిబంధనలు పెట్టారన్నారు. ఏడాదిలోపు స్మార్ట్‌మీటర్లు అందరికి అందుతాయన్నారు.

బద్వేలు..: బద్వేలు మండలం, చింతలచెరువు పంచాయతీ బయనపల్లెలోని చర్చిలో నేచురల్ ఎనర్జీ ఎకనామిక్ డెవలప్‌మెంటు సొసైటీ ఆధ్వర్యంలో సూర్యాఘర్ యోజన పథకంపై సోమవారం విద్యుత్ వినియోగదారులకు డీఈఈ కుళాయప్ప ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఏఈ చిన్నయ్య, సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాబురావు, విద్యుత్‌శాఖ సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.